Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

J.H.Kumar
HANUMAN Digitals
97043 78777,96421 56560
hanumandigitalsvizag@gmail.com
#48-7-46, First Floor, Flower Market,
Srinagar, Ramatalkies Down, VSP - 16
One Stop Solution for your Printing needs....

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 149 విశాఖపట్నం, 22 మార్చి 2024 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ప్రచారానికి రిటర్నింగ్ ఆఫీసర్ అనుమతి తప్పనిసరి : కమీషనర్




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి రిటర్నింగ్ ఆఫీసర్ అనుమతి తప్పనిసరి అని సువిధ యాప్ ద్వారా అనుమతి కోరినప్పటికీ దానిని సంబంధిత నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ద్వారానే అనుమతి ఇవ్వడం జరుగుతుందని నగర పోలీస్ కమీషనర్ ఏ రవిశంకర్ తెలిపారు. గురువారం ఉదయం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఇతర ఫిర్యాదుల ను సి విజిల్ యాప్ , సువిధ యాప్ , డయల్ 100, 112 ల ద్వార కానీ అలాకాని పక్షంలో నేరుగా రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయాలనీ వచ్చిన ఫిర్యాదులను రిటర్నింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలోని మొబైల్ కోడ్ కండాక్ట్ (ఎంసీసీ) బృందాలు విచారించి నివేదిక ఇచ్చిన తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సి విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి కేంద్ర ఎన్నికల కమిషన్ 100 నిమిషాల డెడ్ లైన్ విధించిందని తెలిపారు. నగరంలో ఇప్పటికే 63 మొబైల్ కోడ్ కండాక్ట్ (ఎంసీసీ) బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పార్టీ కార్యాలయాలు పోలింగ్ స్టేషన్ లకు 200 మీటర్ల దూరంలో ఉండాలని ఆయన సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు 5 స్టాటిక్ సర్వైలైన్ టీం

(మిగతా 2లో)

## కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది



లోక్ సభ ఎన్నికలు సమీపించే వేళ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల తూటాల పేలుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పరం ఒకరిపై ఒకరు ఘాటు విమర్శలు చేసుకుంటున్నారు. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా కాంగ్రెస్ పార్టీపై విరుచుకు పడ్డారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం పార్టీని జనాలు పూర్తిగా తిరస్కరించబోతున్నారని జోస్యం చెప్పారాయన. ఆ పార్టీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే భారత ప్రజాస్వామ్యం, ఐటీ, దర్యాప్తు సంస్థలు, అధికారులపై విరుచుపడుతున్నరన్నారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు జేపీ నడ్డా. 'కాంగ్రెస్ పార్టీ తన అసమర్థత, చేతకాని తనాన్ని 'ఆర్థిక ఇబ్బందులు' గా పేర్కొంటోంది. అయితే నిజానికి వారు ఆర్థికంగా దివాళా తీయ లేదు. నైతికంగా, మేధోపరంగా దివాలా తీశారు. ఐటీ లేదా ఢిల్లీ హైకోర్టు అయినా నిబంధనలకు లోబడి ఉంటాయి. అందుకు తగ్గట్టే పన్నులు చెల్లించాలని కాంగ్రెస్ పార్టీని కోరాయి. కానీ ఆ పార్టీ ఎప్పుడూ అలా చేయలేదు'

దేశంలో ప్రతి రంగాన్ని, ప్రతి రాష్ట్రాన్ని, చరిత్రలోని ప్రతి క్షణాన్ని అన్ని విధాలా దోచుకున్న పార్టీ ఆర్థిక క్రమశిక్షణ గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది. ఆర్థిక ఇబ్బందులంటూ చెబుతున్న కాంగ్రెస్ నేతలు జీపు నుంచి హెలికాప్టర్ల వరకు బోఫోర్స్ లాంటి అన్ని స్కామ్ ల ద్వారా దాచుకున్న సొమ్మును తమ ప్రచారానికి వాడుకోవచ్చు. భారతదేశంలో ప్రజాస్వామ్యం అబద్ధమని కాంగ్రెస్ పార్ట్‌టైమ్ నాయకులు అంటున్నారు. 1975- 1977 మధ్య కొన్ని నెలలు మాత్రమే భారతదేశం ప్రజాస్వామ్యం కాదని, ఆ సమయంలో భారత ప్రధాని ఇందిరా గాంధీ తప్ప మరెవరో కాదని నేను వారికి వినమ్రంగా గుర్తు చేస్తున్నాను' అని ట్వీట్‌లో రాసుకొచ్చారు జేపీ నడ్డా.

## ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదని అన్ని శాఖల పరిధిలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది వివరాలను అత్యంత కచ్చితంగా జిల్లా యంత్రాంగానికి నివేదించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున ఆయా శాఖల అధిపతులను ఆదేశించారు. అత్యవసర సేవల్లో నిమగ్నమయ్యే వారు తప్ప మిగిలిన వారందరూ ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. పోల్ మేనేజ్మెంట్, సిబ్బంది కేటాయింపు ఇతర అంశాలపై చర్చించే నిమిత్తం గురువారం జిల్లాలోని అన్ని శాఖల అధిపతులతో కలెక్టరేట్ వీసీ హాలులో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు అంశాలపై మార్గనిర్దేశకాలు జారీ చేశారు.

ఆయా శాఖల పరిధిలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది వివరాలను నిర్ణీత కాలంలోగా అందజేయాలని, ఇదివరకు ఇచ్చిన డేటాలో మార్పులు చేర్పులు ఉంటే ముందుగా తెలియజేయాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా సాగేందుకు అందరూ సహకారం అందించాలని, సమష్టి కృషి చేయాలన్నారు. అత్యవసర సేవల్లో ఉండే సిబ్బందికి మాత్రమే మినిహాయింపు ఉంటుందని, మిగిలిన వారందరూ తప్పకుండా ఎన్నికల

(మిగతా 2లో)

## చంద్రబాబుతో పవన్ భేటీ - సీట్ల మార్పుపై కీలక నిర్ణయం..!



ఎన్నికల వేల చంద్రబాబు - పవన్ కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తున్నారు. రెండు పార్టీలు తమ అభ్యర్థుల పై తుది నిర్ణయానికి వచ్చారు. ఎంపీ అభ్యర్థుల విషయంలో బీజేపీ నుంచి స్పష్టత రాకపోవటంతో తమ అభ్యర్థులను ప్రకటించలేదు. బీజేపీ నుంచి కొన్ని మార్పులతో తాజా ప్రతిపాదనలు అందాయి. దీంతో, ఆ ప్రతిపాదనల్లో అమోదం, సీట్ల మార్పు..అభ్యర్థుల ఖరారు పైన కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఇక,ఎన్నికల ప్రచార ప్రసంగాలపై వీరిమధ్య చర్చ సాగుతోంది.

ప్రచారం పైనే చర్చ : హైదారాబాద్ వేదికగా చంద్రబాబుతో పవన్ భేటీ అయ్యారు. పొత్తులో బీజేపీకి కేటాయించిన సీట్ల పైన చర్చలు జరుగుతున్నాయి. బీజేపీ నేతలు కొన్ని మార్పులు సూచిస్తున్నారు. మరో ఎమ్మెల్యే సీటు కోరుతున్నారు. వైజాగ్ పార్లమెంట్ సీటు పైన పట్టబడుతున్నారు. బీజేపీ తమ సీట్లను ప్రకటించకపోవటంతో టీడీపీ, జనసేన తమ తుది జాబితా ప్రకటించేందుకు వేచి చూస్తున్నాయి. అదే సమయంలో ఉమ్మడి మేనిఫెస్టో పైనా వీరిద్దరు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ముసాయిదా మేనిఫెస్టో సిద్దం చేసి బీజేపీ నేతలతో చర్చ తరువాత విడుదల చేయాలని అధినేతలు చర్చిస్తున్నట్లు సమాచారం. కూటమి పార్టీలుగా ఎన్నికల ప్రచార ప్రసంగాలపై వీరిమధ్య చర్చ సాగుతోంది.

సీట్ల సర్దుబాటు : చంద్రబాబు మార్చి 25, 26 తేదీల్లో కుప్పం నుంచి తన ప్రచారం ప్రారంభించనున్నారు. పవన్ కల్యాన్ ఈ నెల 27 నుంచి కీలక స్థానాల్లో పర్యటనకు సిద్ధమయ్యారు. తన వారాహి ద్వారా ప్రచారం చేయాలని డిసైడ్ అయ్యారు. హైదారాబాద్ నుంచి మంగళగిరికి వారాహిని తరలిస్తున్నారు. ముందుగా ఉత్తరాంధ్రలో ప్రచారం మొదలు పెట్టి గోదావరి జిల్లాల్లో కొనసాగించేలా ప్లాన్ చేస్తున్నారు. జగన్‌కు దీటుగా మేనిఫెస్టో ప్లాన్ చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహం, మేనిఫెస్టో రూపకల్పనపై వీరిద్దరు చర్చ చేస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి పార్టీలుగా ఎన్నికల ప్రచార ప్రసంగాలపై వీరిమధ్య చర్చ సాగుతోంది. ఎన్నికల ప్రచారంలో వీరిద్దరు కలిసి పాల్గొనే మీటింగులతో పాటుగా ఎవరెక్కడ ఫోకస్ చేయాలనేది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

మేనిఫెస్టో కు తుది రూపు : జనసేన - టీడీపీ పొత్తుల్లో ఖరారైన సీట్లలో రెండు చోట్ల మార్పులుంటాయని సమాచారం. తిరుపతి, మదనపల్లి సీట్లలో నిర్ణయం జరిగే ఛాన్స్ కనిపిస్తోంది. జగన్ 27వ తేదీ నుంచి ప్రచారం మొదలు పెట్టనుండటం తో వీరిద్దరూ సైతం పూర్తిగా ప్రజల్లోనే ఉండేలా

(మిగతా 2లో)

## విశాఖ తీరంలో 25 వేల కిలోల డ్రగ్స్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ తీరంలో డ్రగ్స్ కలకలం రేగింది. బ్రెజిల్ నుంచి విశాఖలోని సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌కు వచ్చిన కంటైనర్‌లో 25 వేల కిలోల డ్రగ్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇంటర్‌పోల్ సమాచారంతో సీబీఐ రంగంలోకి దిగి వీటిని స్వాధీనం చేసుకుంది. ఆపరేషన్ గరుడ పేరుతో డ్రగ్స్‌ను సీబీఐ అండ్ కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారు. జర్మనీలోని హ్యాంబర్గ్ మీదుగా ఈ నెల 16న కంటైనర్ విశాఖకు వచ్చినట్లు గుర్తించారు. ఓ ప్రైవేటు కంపెనీ 1000 బ్యాగుల్లో డ్రగ్స్ నింపి సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

## ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టులో ఎస్బీఐ అఫిడవిట్




ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించి ఇటీవల ఎస్బీఐ (భారతీయ స్టేట్ బ్యాంకు) అందించిన వివరాలపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అరకొర వివరాలు కాకుండా, ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమగ్ర వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి అందించాలని తాము ఆదేశిస్తే, తమ ఆదేశాలను పాటించకపోవడం ఏంటని అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో మార్చి 21 సాయంత్రం 5 గంటల్లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఎస్బీఐని ఆదేశించింది.

అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో ఎస్బీఐ ఇవాళ అఫిడవిట్ దాఖలు చేసింది. సీరియల్ నెంబర్లతో సహా ఎన్నికల బాండ్ల వివరాల డేటాను కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేశామని అఫిడవిట్ లో వెల్లడించింది. భద్రతా కారణాల వల్ల బ్యాంకు అకౌంట్ నెంబర్లు, కేవైసీ వివరాలను బహిర్గతం చేయలేదని ఎస్బీఐ వివరణ ఇచ్చింది.

దేశంలో ఎన్నికల బాండ్ల వ్యవహారం ఎప్పటినుంచో చర్చనీయాంశంగా ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ గత నెలలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ ఐదేళ్లలో వచ్చిన ఎన్నికల బాండ్ల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి అందించాలని ఎస్బీఐని ఆదేశించింది.

అయితే, ఎన్నికల బాండ్ల వివరాలను ఎన్నికల సంఘానికి అందించిన బ్యాంకు... వాటి సీరియల్ నెంబర్లను మాత్రం పంచుకోలేదు. దాంతో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.


శ్రీ సింహాద్రి అప్పన్న స్వామి

SAVE

ఆహ్వానం


గో సంతతి అంటే ఆవు, ఎద్దు, ఆడదూడ, మగదూడ

భోజన పండుగలు
గోవు ఆధారితపంటలు - స్థానిక వంటలు
తేది : 22-03-2024 నుండి 26-03-2024
వేదిక : సింహాచలం దేవస్థాన గోశాల, కృష్ణాపురం, సింహాచలం, విశాఖపట్నం

విషయం : 5 రోజుల పండుగ. గోవు ఆధారిత పంటలు - సాంప్రదాయ వంటలు, ప్రకృతి వ్యవసాయము, దేశవాళీ విత్తనాల వ్యాప్తి, స్థానిక ఆహారపు అలవాట్లు, వంట పాత్రల వాడకము, స్థానిక చేతి వృత్తుల వారికి ఉపాధి వంటి అంశములు గురించి ప్రజలకు అవగాహన కలిగించ డానికి S.A.V.E సంస్థ 5 రోజుల పాటు "భోజన పండుగలు" నిర్వహంచ తలపెట్టినది.



వక్తలు : 1. పద్మశ్రీ శ్రీ సుభాష్ పాలెకర్‌గారు
2. శ్రీ విజయ్ రామ్ గారు
(ప్రకృతి (SPK) వ్యవసాయ సాధకులు)



దయచేసి గమనించవలెను. అన్ని రోజులూ ఒకే రకము అయిన కార్యక్రమాలు ఉంటాయి. కనుక అయిదు రోజులలో ఏదో ఒక రోజు వస్తే సరిపోతుంది.

సుభాష్ పాలెకర్ కృషి (SPK) అనగా ఆవు ఎరువుతో చేసే సహజ వ్యవసాయ పద్ధతి

ఈ కార్యక్రమానికి రావలనుకున్నవారు క్రింది తెలిపిన లింక్ ద్వారా హాజరు కావల్సిందిగా కోరుచున్నాము

https://bit.ly/VizagNaturalFoodFest

Contact Details
Save Office : 6309111427 (3pm to 6pm)
Whatsapp No. : 9949190769 (Surendra Garu)
Mobile : 9490062627 (Satyanarayana Garu)
9246627567 (Chalapathi Rao Garu)
9989166979 (B.V.R. Raju Garu)

SAVE

ఆహ్వానించువారు
శ్రీ విజయ్ రామ్ గారు
(ప్రకృతి (SPK) వ్యవసాయ సాధకులు)
SAVE ORGANISATION

## (మొదటి పేజీ తరువాయిలు)

### ప్రచారానికి రిటర్నింగ్ ఆఫీసర్ అనుమతి తప్పనిసరి : కమీషనర్

(ఎస్ ఎస్ టి) టీములను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు . ఇప్పటికే ఎన్నికల భద్రత కోసం రెండు సిఐఎస్ఎఫ్, ఒక సిఆర్పిఎఫ్ బెటాలియన్ బలగాలు నగరానికి చేరుకున్నాయని అదేవిధంగా మీడియా సెల్ మోనిటరింగ్ సెంటర్ (ఎం సి ఎం సి) ద్వారా సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు పోస్టులపై పూర్తి నిఘా ఉంటుందని ఏదైనా ప్రకటన కానీ లేదా పోస్ట్ గాని పెట్టేముందు దానిపై స్పష్టత ఉంటేనే పెట్టాలని లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. వ్యక్తిగత దాడులకు పాల్పడవద్దని, కుల , మత సామాజిక వర్గాల మధ్య గొడవలు పెట్టే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలో 728 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉన్నాయని వీటన్నిటిని ఆయా స్టేషన్లో డిపాజిట్ చేయడం జరిగిందని స్టీల్ ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో పలువురు నాటు తుపాకులు కలిగి ఉన్నారని సమాచారం తమకు ఉందని వాటిని కూడా డిపాజిట్ చేస్తామని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా సి విజిల్ , డయల్ 100 , 112 లకు ఫిర్యాదు చేసేవారు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని తప్పుడు ఫిర్యాదులు చేస్తే ఐపిసి సెక్షన్ 182 ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే రౌడీ షీటర్ల పై గత నెలరోజులుగా నిఘా పెంచడం జరిగిందని నగరవ్యాప్తంగా రౌడీషీట్లు, డెకరేట్లు, కేడీలు అనుమాని తులు మొత్తం కలుపుకొని 2902 మంది ఉన్నారని, వారిలో 175 మంది ప్రస్తుత పోలీస్ శాఖకు అందుబాటులో లేరని వారిని కూడా త్వరలోనే పోలీస్ శాఖ ఆధీనంలోకి తీసుకుంటామని తెలిపారు, వీరిపై ప్రత్యేక నిఘా కూడా ఉంచడం జరిగిందని ఆయన తెలిపారు. ఎలక్షన్ విధులు నిర్వహించే పోలీసులు, ప్రత్యేక భద్రతా దళాలకు చెందిన సిబ్బంది ఐడి కార్డుల తోపాటు డ్యూటీ పాస్ లు కూడా కలిగి ఉంటారని ఎవరి మీద అయిన అనుమానం వస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ మీడియా సమావేశంలో జాయింట్ కమిషనర్ ఫకిరప్ప , డిసీపి-1 మణికంఠ డిసిపి-2మూర్తి పాల్గొన్నారు.

### ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదు

విధుల్లో భాగస్వామ్యం కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు సరిపడా సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నాటికి వివరాలను అత్యంత కచ్చితంగా సమర్పించాలని సూచించారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, వీఎంఆర్డీఏ జేసీ, మానవ వనరుల కేటాయింపు నోడల్ అధికారి రవీంద్ర, వివిధ విభాగాల హెచ్.వో.డి.లు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబుతో పవన్ భేటీ - సీట్ల మార్పుపై కీలక నిర్ణయం..!

కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రేపు రెండు పార్టీల నుంచి పార్లమెంట్ కు పోటీ చేసే అబ్యర్థుల జాబితా ప్రకటించనున్నారు. జగన్ టార్గెట్ గా.. మేనిపెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. పవన్ కల్యాన్ ఎక్కువగా ఉత్తరాంధ్ర, గోదావరి లో ప్రచారం పైన ఫోకస్ చేయనున్నారు. చంద్రబాబు రాయలసీమ జిల్లాల్లో కొనసాగేలా ప్లాన్ చేసారు. బీజేపీ తో కలిసి ఉమ్మడి ప్రచారం పైన మరోసారి కమలం పార్టీ నేతలతో భేటీ కావాలని నిర్ణయించారు.

### రాజమహేంద్రవరం పరిధిలో 23 మంది వాలంటీర్ల సస్పెన్షన్

**రాజమహేంద్రవరం:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిధిలో 23 మంది వాలంటీర్లను సస్పెండ్ చేశారు. వైకాపాకు అనుకూలంగా పని చేస్తున్నారని ఇటీవల వారిపై తెదేపా నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వాలంటీర్లను సస్పెండ్ చేస్తూ రిటర్నింగ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించకుండా వైకాపా నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్న 45 మంది వాలంటీర్లను అధికారులు బుధవారం విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. వాలంటీర్లు ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## 25న అప్పన్న స్వామి డోలోత్సవం

**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న అప్పన్న స్వామి డోలోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో సింగల శ్రీనివాసమూర్తి బుధవారం తెలిపారు. ఆ రోజు స్వామివారు ఉదయం 6.30 గంటలకు సింహగిరిపై నుంచి మెట్ల మార్గంలో కొండ దిగువకు చేరుకుంటారన్నారు. పుష్కరిణి సత్రం ఆవరణలోని ఉద్యాన మండపంలో అర్చకులు స్వామిని కొలువుదీర్చి డోలోత్సవం, వసంతోత్సవం, చూర్ణోత్సవం నిర్వహిస్తార న్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని 25న ఉదయం స్వామివారి ఆలయంలో జరిగే నిత్య కల్యాణోత్సవాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. డోలోత్సవాన్ని గ్రామస్థులు డోలా పౌర్ణమి, బొట్టినడిగే పున్నమిగా వ్యవహరిస్తారు.

## రాజకీయ ప్రకటనలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, ఫోటోలు, తదితరాలు 24 గంటల్లో తొలగించడం జరిగింది

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చిన నేపధ్యంలో ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ ప్రకటనలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, ఫోటోలు, తదితరాలు 24 గంటల్లో తొలగించడం జరిగిందని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పబ్లిక్ ఆస్తుల వద్ద రాజకీయ ప్రకటనలకు సంబం దించిన ఫొటోలతో కూడిన పోస్టర్లు, బ్యానెర్లు, హోర్డింగ్లు, జెండాలు వంటివి మొత్తం 30 వేల 947 తొలగించడం జరిగిందని గురువారం కలెక్టర్ డా. కృతికా శుక్లా ఒక ప్రకటన లో తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ ప్రదేశాలలో ఉన్న వాల్ రైటింగ్లు, పోస్టర్లు, బ్యానెర్లు,హోర్డింగ్లు, జెండాలు వంటివి మొత్తం 10 వేల 119 తొలగించడం జరిగిందన్నారు.

జిల్లాలో సి విజిల్ యాప్ ద్వారా 68 ఫిర్యాదులు అందాయని అందులో 41 ఫిర్యాదులు డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని వచ్చాయని వాటిని డ్రాప్ చేయడం జరిగిందని మరో 13 ఫిర్యాదులు సక్రమంగా లేవని, మిగిలిన 14 ఫిర్యాదులు ఆర్వోలు పరిష్కరించడం జరిగిందని, అందులో 13 ఫిర్యాదులు వంద నిమిషాల లోపల పరిష్కరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్నికలకు సంబంధించి వివిధ రకాల అనుమతులు కొరకు 56 దరఖాస్తులు రాగా అందులో 30 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందని 11 దరఖాస్తులు తిరస్కరించగా, నాలుగు ప్రోగ్రెస్ లో ఉన్నాయని, మరో 11 పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు .

జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకునేందుకు వచ్చిన అనుమతులలో డోర్ టు డోర్ కాన్వాసింగ్ చేసుకునేందుకు 20 దరఖాస్తులు, వెహికల్ పర్మిషనుకు 13 దరఖాస్తులు, లౌడ్ స్పీకర్ తో వెహికల్ పర్మిషనుకు ఆరు, తాత్కాలిక పార్టీ కార్యాలయ ప్రారంభించేందుకు 4 దరఖాస్తులు, పాంప్లెట్లు పంపిణీ చేసేందుకు 2 దరఖాస్తులు, బ్యానర్లు ప్రదర్శించేందుకు 2 దరఖాస్తులు, వెహికల్ ఫర్ కాండిడేట్ అండ్ ఎలక్షన్ ఏజెంట్ లకు 2 దరఖాస్తులు, ఇతర కారణాలకు 7 దరఖాస్తులు రావడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 23.36 లక్షల విలువైన ఐటమ్స్ ను సీజ్ చేయడం జరిగిందని అందులో 24 వేల క్యాష్, 20.39 లక్షల విలువైన లిక్కర్, ఇతర ఐటమ్స్ 2.72 లక్షల విలువైన వస్తువులను సీజ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందులో పోలీస్ శాఖ ద్వారా 3.51 లక్షలు, స్టేట్ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్/కమర్షియల్ టాక్స్ ద్వారా 74 వేలు, ఇతర సంస్థల ద్వారా 19.11 లక్షలు విలువైన వస్తువులు సీజ్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 324 ఆయుధాలకు పర్మిషన్లు ఉండగా అందులో 263 ఆయుధాలు డిపాజిట్ చేశారని, 61 ఎస్సెన్షియల్ సర్వీసులకు మినహాయింపు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 23 ఎఫ్ ఎస్ టి టీములు పనిచేస్తున్నాయని, మూడు అంతర రాష్ట్ర చెక్ పోస్టులు, 5 అంతర జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గడిచిన 24 గంటలలో జిల్లాలో ఎక్సైజ్, ఎస్.ఈ.బి శాఖల ద్వారా 21 ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 203.7 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేయడం జరిగిందని, 16 కేసులు బుక్ చేసి 11 మందిని అరెస్టు చేయడం జరిగిందని కాకినాడ జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు.

## అక్రమ కేసులకు భయపడవద్దు : భువనేశ్వరి పిలుపు



**రైల్వేకోడూరు:** తెలుగుదేశం పార్టీ కార్య కర్తలు అక్రమ కేసులకు భయ పడ వద్దని కార్యకర్తలకు అండగా ఉంటా మని టిడిపి జాతీయ అధ్య క్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా భువనేశ్వరి బద్వేల్ కు వెళుతూ మార్గ మధ్యలో కోడూరు పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకులు కస్తూరి విశ్వనాథ నాయుడు మాచినేని విశ్వేశ్వర నాయుడు అధ్వ ర్యంలో టిడిపి నాయకులను కలిశారు. ముక్కావారి పల్లె వద్ద టిడిపి ఇన్చార్జి ముక్కా రూపనంద రెడ్డి, ఆయన సతీమణి వరలక్ష్మి భువనేశ్వర్ కి ఘన స్వాగతం పలికారు. రూపానంద రెడ్డి ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి భువనేశ్వరి ప్రసంగిస్తూ వైసీపీ ప్రభుత్వం చంద్ర బాబు నాయుడు పై అక్రమ కేసులు బనాయించి 53 రోజులు జైలులో ఉంచారని అమె ఆరోపించారు. ఆ సమయంలో అక్రమ అరెస్టును జీర్ణించుకోలేని కార్యకర్తలు తీవ్ర మనస్థాపానికి గురై మృతి చెందారని అలాంటి వారి కుటుంబాలను తాను పరామర్శించి మనో ధైర్యాన్ని కల్పిస్తున్నారని అన్నారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రావాలని అన్నారు. కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేసి కూటమి అభ్యర్థిని ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. అనంతరం రూపానంద రెడ్డి నివాసంలో భువనేశ్వరి బృందానికి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కేకే చౌదరి,ముక్కాసాయి వికాస్ రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరుగురు వలంటీర్లపై ఎలక్షన్ కమిషన్ వేటు

బందరు మండలం చిన్నాపురం గ్రామంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను వ్యతిరేకంగా వైసీపీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆరుగురు వలంటీర్లపై వేటు పడింది.

ప్రచారంలో పాల్గొన్న ఆరుగురు వలంటీర్లను విధుల నుండి తొలగిస్తూ ఎంపీడీఓ ఉత్తర్వులు జారీ చేశారు.

వలంటీర్లపై చర్యలు తీసుకుంటున్నా కొంత మంది వలంటీర్లు ఎన్నికల నిబంధనలు తమకు పట్టవన్నట్టు వ్యవహరిస్తున్నారు.

గిలకలదిండిలో ఎమ్మెల్యే పేర్ని నాని నిర్వహించిన ప్రచారంలో లంకే ఏడుకొండలు అనే వలంటీర్ పాల్గొనడం గమనార్హం.

## అరలో రూ.అర కోటి గంజాయి



శృంగవరపుకోట,: అదో పొక్లెయిన్ తరలించే లారీ. ఖాళీగానే వెళుతోంది. అయితే చోదకుడి వద్దనున్న క్యాబిన్‌లో పైన ప్రత్యేక అరలో 350 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రెండు కిలోల ప్యాకెట్ల రూపంలో ఉన్న సరకును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఎస్.కోటలో ఎస్ఈబీ ఏఈఎస్ బీవీజీ.రాజు బుధవారం సాయంత్రం వెల్లడించారు. మంగళగిరిలోని ఉన్నతాధికారులకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు.. అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దులో ఉన్న బొడ్డవర చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. అరకులోయ వైపు నుంచి ఖాళీగా వస్తున్న హరియాణా రాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో ఉన్న లారీని ఆపి సోదా చేశారు. డ్రైవర్ క్యాబిన్‌లో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అర నుంచి 350 కిలోల గంజాయిని వెలికితీసి ఎస్.కోట ఎస్ఈబీ కార్యాలయానికి తరలించారు. దీని విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.50 లక్షలు ఉంటుందని ఏఈఎస్ రాజు తెలిపారు. చోదకుడు ముస్తాక్ ఖాన్(రాజస్థాన్)ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. పైలెట్గా వ్యవహరించిన వ్యక్తి తప్పించుకున్నాడని, అతడి కోసం గాలిస్తున్నామన్నారు. దిల్లీ నుంచి విశాఖ ఎన్ఏడీ కూడలికి పొక్లెయిన్‌ను తీసుకొచ్చిన ఈ లారీలో అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం బొంగరం గ్రామం వద్ద గంజాయి లోడు చేశారని వివరించారు. సరకును ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బెనారస్‌కు తరలిస్తున్నారన్నారు. ఎస్.కోట సర్కిల్ సీఐ ఎ.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## రూ.69 వేలకు చేరువలో బంగారం



హైదరాబాద్: పసిడి ధరకు మరోసారి రెక్కలు వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారానికి డిమాండ్ ఏర్పడడంతో దేశీయంగానూ ధర పెరిగింది. 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) పసిడి ధర హైదరాబాద్‌లో రూ.68,800పైనే (ట్యాక్సులతో కలిపి) పలుకుతోంది. ఆర్నమెంట్‌కు వినియోగించే 22 క్యారెట్ల బంగారం రూ.64 వేల వరకు ఉంది. బుధవారంతో పోలిస్తే దాదాపు ఒకే రోజు వెయ్యి రూపాయల మేర ధర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 2208 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఔన్సు వెండి ధర 25.51 డాలర్ల వద్ద కొనసాగుతోంది. వడ్డీ రేట్లలో ఈ ఏడాది మూడు సార్లు కోత ఉంటుందని ఫెడ్ సంకేతాలు ఇవ్వడంతో డాలర్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఇది పసిడి డిమాండ్‌కు కారణమైందని బులియన్ ట్రేడింగ్ వర్గాలు చెబుతున్నాయి.

### పంచాంగం

శుక్రవారం 22-03-2024
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం ,శిశిర ఋతువు
ఫాల్గుణమాసం

| | |
|---|---|
| తిథి | : శు. త్రయోదశి పూర్తి |
| నక్షత్రం | : మఖ తె. 04.42 |
| వర్జ్యం | : ప. 03.31 ల 05.15 |

## ఎన్నికల సందర్భంగా ముమ్మర తనిఖీలు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** రానున్న సార్వత్రిక ఎన్నికలు-2024 లో భాగంగా గురువారం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్,ఐపిఎస్, బలిజిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల సాధారణ,సమస్యాత్మక,అతి సమస్యాత్మక గ్రామాలైనా బలిజిపేట, పెద పెంకి, బర్లి, వంతరాం, చిలకలపల్లి, గంగాడ, నారంనాయుడు వలస, గలావిల్లి, తదితర గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ భవనాలను సందర్శించి వాటి యొక్క స్థితి గతులు,మౌలిక వసతులు,భద్రత పరమైన ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకొని తగు సూచనలు,సలహాలు ఇచ్చారు...ఈ పోలింగ్ స్టేషన్స్ సందర్శనలో ఎస్పీ తో పాటుగా పార్వతీపురం రూరల్ సి.ఐ కె.రవికుమార్,బలిజిపేట యస్.ఐ వి.పాపారావు ,సీతానగరం యస్.ఐ యం.రాజేష్ కూడా పాల్గొన్నారు.

## ఆంధ్రా ఒడిశా పోలీసుల సంయుక్త తనిఖీలు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా ఒడిశా పోలీసుల సంయుక్త తనిఖీలు చేపట్టారు. కొమరాడ, పార్వతీపురం సబ్ ఇన్సపెక్టర్ లు, కోరాపుట్ జిల్లా బందుగాం పోలీస్ స్టేషన్ సిబ్బంది గురువారం పార్వతీపురం మండలం, ఇతర ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో 14,500 లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలమండ గ్రామం వద్ద 32 డ్రంలలో ఉన్న పది వేల లీటర్లను, కర్లి గ్రామం వద్ద 15 డ్రంలలో లభ్యమైన 4,500 లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గురువారం జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఆంధ్రా ఒడిశా సరిహద్దుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటుకు, ఇరువర్గాల సహాయ సహకారాలు అందించుకొనుటకు అంగీకరించడం జరిగింది.


రండి! దర్శించండి!! తరించండి!!!
శ్రీ దత్తాత్రేయ స్వామి మందిరం
మొగిలిచెర్ల - నెల్లూరు జిల్లా

తేది : 25 - 03- 2024 సోమవారం పాల్గుణ మాస పౌర్ణమి సంధర్భంగా
మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత
మహా మృత్యుంజయ హోమము
నిర్వహిస్తున్నాము.
ఈ హోమము నందు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనదలచిన భక్తులు
మరిన్ని వివరాలకు క్రింది సెల్ నెంబర్లను సంప్రదించగలరు.
99 08 97 36 99 99 49 74 28 65
63 02 61 68 97
గమనిక : ప్రత్యక్షంగా పాల్గొనదలచిన భక్తులు
25-03-2024 న ఉదయం 8 గంటలకు
మందిరము వద్దకు చేర ప్రార్థన.

# విశాఖ సమాచారమ్

శుక్రవారం 22-03-2024


## ఆగని అవినీతి

లంచం తీసుకోవడం తమ జన్మహక్కుగా భావించే ప్రభుత్వ ఉద్యోగులకు కొదవ లేదు. లంచం తీసుకోవడం నేరమని, పట్టుబడితే ఉద్యోగం పోతుందని తెలిసి కూడా వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఇంకా లంచ గొండితనం అనే వ్యసనంలోనే మగ్గిపోతున్నారు. ప్రతీ పనికి లంచం తీసుకోవడం, తమ ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనంలో భాగం కోరడం ప్రభుత్వ ఉద్యోగులకు సర్వసాధారణమైపోయింది. ప్రజలతో నేరుగా సంబంధాలు నెరపే ఉద్యోగులు మాత్రమే ఇటువంటి అక్రమార్జన చేస్తారనేది ఎంత వాస్తవమో కీలకమైన ఫైళ్లు చూసే వ్యక్తులు కూడా ఏదో విధంగా సంబంధిత వ్యక్తులను తమ వద్దకు రప్పించుకునేంత వరకు ఫైలు కదపకుండా తొక్కి పెట్టి చివరికి సదరు వ్యక్తి వచ్చిన తరువాత తగినంత మూల్యం చెల్లిస్తేనే ఆయా ఫైళ్లు ముందుకు పంపే సందర్భాలు కూడా కోకొల్లలు.

అవినీతిపూర్వకంగా సంపాదించిన సొమ్మును నిర్భయంగా ఆస్థుల రూపంలో మార్చుకోవడం, బంగారం, వజ్రాల రూపంలోకి మార్చడం, లాకర్లలో నగదును కూడా దాచిపెట్టడం అనేక సందర్భాలలో బయటపడింది. కానీ అటువంటి అధికారులు, ఉద్యోగులు పొంతనలేని ఆదాయం మరియు ఆస్థుల నేరస్థులుగా అరెస్టైన వారం రోజులకే బయటకు రావడం, ఆరు నెలల అనంతరం వెంటనే మళ్లీ ఉద్యోగం సంపాదించడం యథావిధిగా జరిగిపోతున్నాయి. అవినీతి నిరోధక శాఖ పట్టుకున్న వారిలో పదిశాతం మందికి కూడా ఉద్యోగాలు పోకపోగా న్యాయవాదులు తమ తెలివితేటలతో అటువంటి వారిని కాపాడి మళ్లీ ఉద్యోగాలు పొందేందుకు సహకరించడంతో ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి నిరోధక శాఖకు కూడా భయపడటం లేదు. మహిళా ఉద్యోగులు సహితం నిర్భయంగా, కర్కశంగా లంచాలు వసూలు చేస్తూ ఆస్థులు కూడబెట్టుకుంటున్నారు. ఒక ఉద్యోగి పదవీ కాలంలో ఎన్ని అక్రమాలు చేస్తాడో, అతను పదవీ విరమణ చేసిన తరువాత ప్రభుత్వ ఉద్యోగులతో పనిపడినప్పుడు అతనికి తెలిసివస్తుంది. ఉన్నతాధికారులు సహితం రిటైరైన తరువాత తమ వద్ద పనిచేసిన దిగువ స్థాయి సిబ్బందికి కూడా లంచాలు ఇచ్చుకోవలసి రావడం ఎంతో హీనమైన పరిస్థితి. కానీ ప్రభుత్వ ఉద్యోగాలలో ఇది సర్వసాధారణం. ఒక అధికారి కూడా తమ విభాగాన్ని అవినీతిరహితంగా ఉంచలేకపోవడం వలన, తిలాపాపం తలాపిడికెడు అన్న చందంగా తన పదవీ కాలంలో పొందిన అవినీతి సొమ్మును వాటాలు వేసిన అనుభవాలు వారికి గుర్తుకువస్తుంటాయి.

మనదేశంలో అవినీతినిరోధక వ్యవస్థ పటిష్టంగా లేదు. ఈ చట్టాన్ని చాలా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. చట్టంలో ఉన్న లొసుగులను అవినీతిపరులు యథేచ్ఛగా వినియోగించుకుంటున్నారు. సాధారణంగా నేరపూరిత అక్రమాల విషయంలో చట్టం మూలాలను సైతం పరిగణనలోకి తీసుకుంటుంది. కానీ ఉద్యోగుల అవినీతి విషయంలో ప్రథమస్థాయిలోనే అవినీతి విచారణ ఆగిపోతోంది. ఒక ప్రభుత్వ కాంట్రాక్టు పొందిన వ్యక్తి ఆ పనిని నిర్వహించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా సంబంధిత ఉద్యోగులు, అధికారులూ, ప్రజాప్రతినిధులూ చివరికి పత్రికా విలేఖరులకు కూడా లంచాలు చెల్లిస్తున్నారు. ఇలాంటి వ్యవహారంలో ఒక ఉద్యోగి లంచగొండిగా పట్టుబడి నిరూపితమైతే కేవలం అతడికి మాత్రమే శిక్ష పడుతోంది. కానీ పైనచెప్పుకోబడిన మిగిలిన వ్యక్తులెవ్వరికీ ఎటువంటి సంబంధము లేనట్లుగా అనిశా... ప్రవర్తిస్తోంది. ఒక అవినీతి జరిగితే ఆ విభాగం మొత్తానికి అందరినీ బాధ్యులను చేసిన నాడు మరలా అవినీతి జరిగేందుకు ఆస్కారం ఉండదు.

అవినీతిపరుల గొలుసు చాలాబలంగా ఉంటుంది. ఈ గొలుసులో అక్రమంగా డబ్బు ఇచ్చేవారు, డబ్బు స్వీకరించేవారు సదరు డబ్బును దాచేవారు, రశీదులు లేకుండా బంగారాలు విక్రయించేవారు, నల్లధనంతో ఆస్థులు విక్రయించే వారు, పట్టుబడినప్పుడు రక్షించేందుకు కృషిచేసే చట్టసంబంధిత వ్యక్తులు ఈ గొలుసులో భాగస్వాములుగా ఉంటారు. ఆఖరికి చట్టాన్ని అమలుచేసే అధికారులు, వారితరపు నిలిచే న్యాయవాద ప్రతినిధులు కూడా అప్పుడప్పుడు ఈ గొలుసులో భాగంగా నిలుస్తుంటారు. చట్టం అనేది అవినీతి విషయంలో ఎంతబలహీనంగా ఉందో ప్రస్తుత వ్యవస్థే తేటతెల్లం చేస్తోంది. ఎన్నికల సమయంలో అక్రమ ధనం, అక్రమ మద్యం, అక్రమ బహుమతులు పట్టుబడితే సదరు వ్యక్తుల్ని వెంటనే జైలులో నిర్బంధించి ఎన్నికలు అయ్యేంతవరకు బయటకు వదలకుండా నిర్బంధించేలా చట్టం ఉంటే ఇలాంటి ప్రలోభాల వల కదలిక లేకుండా ఉంటుంది. అక్రమ సొమ్మును లేదా వస్తువులను స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తుల్ని వదలివేస్తుండడంతో ఇలాంటి కార్యక్రమాల్లో అనేకమంది భాగస్వాములవుతున్నారు. గంజాయి, ఎర్రచందనం, మత్తుపదార్థాల విక్రేతలు కూడా చట్టం పట్ల తేలిక భావంతోనే ఇంకా ఇంకా పెరిగిపోతున్నారు.

-సూరంపూడి వీరభద్రరావు

## ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి



చింతపల్లి, (విశాఖ సమాచారమ్): వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఎన్ని కల నిబంధ నలను విధిగా పాటించి ప్రచా రానికి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉందని చింతపల్లి సబ్ డివిజనల్ అదనపు ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎక్కడికక్కడ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఎన్నికల ప్రచారంలో పోలీస్ అనుమతి పత్రాలు లేనియెడల ఆ వాహనంతో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వ్యక్తులపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో రాజకీయ నాయకులు ముందస్తు అనుమతి పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని ఆయన సూచించారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్




యలమంచిలి, (విశాఖ సమాచారమ్): శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ప్రజలకు భరోసాను,మనోధైర్యం కలిగించడానికే పట్టణ పురవీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని ట్రైనీ డీఎస్పీ భవ్య,సిఐ ఎస్ కె గఫూర్ లు తెలిపారు. జిల్లా ఎస్పీ కె.మురళీకృష్ణ ఆదేశాల మేరకు గురువారం యలమంచిలి పట్టణంలో సిఐ అధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ వ్యతిరేక శక్తులను హెచ్చరించడానికి రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు, ప్రజలందరికీ పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని ధైర్యాన్ని కల్పించడానికే ఈ ఫ్లాగ్ మార్చ్ అని అన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిఎస్పీ భవ్య, టౌన్ ఎస్ఐ కె.పాపినాయుడు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కొట్నీ వీధిలో భరత్ కు విజయం చేకూర్చాలని ఎన్నికల ప్రచారం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జీవీఎంసీ 84 వార్డు కోట్నీ వీధిలో గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మద్దతుగా వైసిపి నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. నిరుపేదలందరికీ సొంతిల్లు కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ దక్కుతుందన్నారు. అనకాపల్లి అభివృద్ధి చెందాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భరత్ కుమార్ ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు. అప్పికొండ రవిశంకర్, కోరుకొండ రమేష్, కేతిరెడ్డి ప్రసాదు, సేనాపతి సాయి, కొసిరెడ్డి నాగేషు, కే నాగరాజు, ఐ వి కృష్ణారావు,, బలిరెడ్డి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## కోదండ రామాలయం లో ప్రత్యేక పూజలు చేసిన జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): తగరపువలస లో శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూర్ణాహుతి కార్యక్రమంలో భీమునిపట్నం మండలం జడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు మూడు రోజులుగా శ్రీ కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఆలయ నిర్వాహకులు నిర్వహించారు చివరిరోజు కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటప్పుడు, మణికంఠ స్వీట్స్ బేకరీ అధినేత అధిమూలం నాగరాజు,రంగూరు రాంబాబు, లక్ష్మీపురం గ్రామ శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి సేవాపీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు సింగనబంధ గ్రామ సర్పంచ్ గాడు వెంకటనారాయణ సామంతుల సత్తిరాజు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలకు అంతర్ రాష్ట్ర సమన్వయ సమావేశం



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పార్వతీపురం మన్యం, రాయగడ, కోరాపుట్ జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహణకు పరస్పరం సమన్వయంతో వ్యవహరించాలని నిర్ణయించారు. మూడు జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్‌లతో గురువారం సమన్వయ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ విధానంలో జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ ఈ సమావేశాన్ని సమన్వయపరిచారు. సజావుగా, నిష్పాక్షికమైన ఎన్నికలే లక్ష్యంగా కృషి చేయాలని ఆయన అన్నారు. జిల్లాల్లో ఒకే దశలో ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రత్యేకించి ఐడీ మద్యం, మాదకద్రవ్యాలను అరికట్టడం, ఉచితాల పంపిణీని నియంత్రించడం, పోలింగ్ సిబ్బందికి వాహనాలు సమకూర్చడం, జిల్లాల సరిహద్దుల్లో పోలింగ్ సిబ్బంది వెళ్ళడం వంటి అంశాల్లో సమన్వయం ఉండాలన్నారు. కొటియా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ, సరిహద్దుల గుండా మద్యం రవాణా , రైల్వేలు - బస్సుల ద్వారా గంజాయిని తరలింపు నియంత్రణ, ఇరువైపుల సరిహద్దు చెక్‌పోస్టులపై నిఘా ఉంచడం జరగాలని ఆయన అన్నారు. ఎన్నికలకు వాహనాలను సమకూర్చడంలో రెండు వైపుల సహకారం అవసరం అని ఆయన అన్నారు.

**కోటియా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి**

నిశాంత్ కుమార్ కోటియా ప్రాంత ఎన్నికలను గూర్చి మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటు వేయడానికి అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. "ఓటు వేయకుండా అడ్డుకోకూడదు" అని ఆయన ఉద్బోధించారు. న్యాయపరమైన పరిధిలో ఉందని ఆయన పేర్కొంటూ జిల్లా యంత్రాంగాలు ఓటర్ల స్వేచ్ఛకు భంగం కలిగించ రాదని స్పష్టం చేశారు.

"ఓటర్లు తమ ఇచ్చానుసారం ఓటు వేస్తారు, ఇది చారిత్రాత్మకంగా కొనసాగుతోంది" అని ఆయన అన్నారు. "మా జిల్లా యంత్రాంగం ఓటర్లను అడ్డుకోదని, మీ జిల్లా యంత్రాంగం ఓటర్లను అడ్డుకోవద్దని" స్పష్టం చేయగా అందుకు కోరాపుట్ జిల్లా యంత్రాంగం సహకరించేందుకు అంగీకరించింది. 22 గ్రామాలకు 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ జాబితాను కోరాపుట్ జిల్లాకు పంపుతామని జిల్లా కలెక్టర్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా గుండా వెళ్ళే పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఆటంకం కలగదని రాయగడ జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు ఆయన తెలిపారు.

పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ సరిహద్దు చెక్ పోస్టలను ఏర్పాటు చేశామని, సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

కోరాపుట్ జిల్లా కలెక్టర్ వి కీర్తి వాసన్ మాట్లాడుతూ ప్రశాంతంగా, సజావుగా ఎన్నికల నిర్వహణ కోసం అన్ని అంశాలలో సమన్వయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కోటియా ప్రాంతంలో 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో 2 కేంద్రాలు సరిహద్దుకు సమీపంలో ఉన్నాయని చెప్పారు. కోటియా గ్రామాల్లో ఓటర్లకు తమ జిల్లా యంత్రాంగం ఎలాంటి ఆటంకాలు కలిగించవని తెలిపారు.

రాయగడ జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ మాట్లాడుతూ కొంతమంది పోలింగ్ సిబ్బంది కొమరాడ మండలం మీదుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉందని, ఈ తరుణంలో సహకరించాలని కోరారు.రాయగడ పోలీస్ సూపరింటెండెంట్ హరీష్ బిసి, కోరాపుట్ పోలీసు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇన్‌ఛార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవ నాయుడు, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, జిల్లా రవాణా అధికారి సి మల్లిఖార్జున రెడ్డి, ఎస్ ఇ బి ఏ ఇ ఎస్ జీవన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ఎస్పీ మురళీకృష్ణ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా, చోడవరం పీఎస్ లో హోంగార్డు గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన హెచ్.జి.నెం.606, సి.హెచ్.సింహాచలం నాయుడు, భార్యలక్ష్మికు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ .3,91,920 రూపాయలునగదు చెక్ ను తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డు ఎవరైనా విధి నిర్వహణలో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా లలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే ఒక రోజు డ్యూటీ అలవెన్స్ ను ఆర్థిక సహాయంగా అందచేస్తారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలన అధికారి బి.శారద పాల్గొన్నారు.

## వైసీపీలోకి చేరికల వెల్లువ



రాంబిల్లి, (విశాఖ సమాచారమ్): మండలంలో కొత్తపట్నం గ్రామానికి చెందిన సుమారు 100 మంది టీడీపీ నాయకులు ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు సమక్షంలో గురువారం నాడు వైసీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు, మాజీ డిసిసిబి చైర్మన్ యు. సుకుమార్ వర్మలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ తమ మత్స్యకారుల అభివృద్ధి జగన్ ద్వారానే సాధ్యమని భావించామని,నేవి ప్యాకేజీల సమస్యపై పూర్తి సహాయ సహకారాలు అందించి తమపై ఎటువంటి కేసులు లేకుండా న్యాయబద్ధంగా వారికి రావలసిన ప్యాకేజీలు మాకు ఇప్పించిన ఎమ్మెల్యే కన్నబాబుని రానున్న సార్వత్రిక ఎన్నికలలో అఖండ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి మండలం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కొత్తపట్నం వైసిపి నాయకులు పాల్గొన్నారు.




# విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తుంది. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండానే ఎలాగైనా చంపాలనే ప్రయత్నం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన సొంత గనులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టింది. రూ.5వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వలేదు. ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్య దోరణితో వ్యవహిరిస్తుంది. నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా బిజెపి కుట్రపూరితంగా వ్యవహరిస్తుంది. విశాఖ ఉక్కు ప్రారంభంలోనే 550 మెగా వాట్ల విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పారు. దీనిలో ఉత్పత్తి అయిన దానిలో 250 మెగా వాట్లు స్టీల్‌ప్లాంట్‌కు సరఫరా చేయగా మిగిలిన 300 మెగా వాట్ల విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసేవారు. దానికి కావల్సిన ధర్మల్ బొగ్గును ఒరిస్సాలోని కోలిండియాతో ఒప్పందం చేసుకుంది. ఏటా సుమారు 17లక్షల టన్నులు ధర్మల్ బొగ్గును విశాఖ ఉక్కుకు సరఫరా చేయాల్సి వుంది. బొగ్గు సరఫరా చేయాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అడుగుతుంటే సరఫరా చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటకీరణ అంశం వచ్చేసరికి బొగ్గు సరఫరా కూడా తగ్గించేశారు. దీనితో ఇపిడిసిఎల్‌పై స్టీల్‌ప్లాంట్ ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి నెల 90కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుంది. నేడు 140కోట్లు వరకు బకాయి వుండడంతో ఇపిడిసిఎల్ వారు నోటీసులు ఇచ్చి ఇబ్బందులు పెడుతున్నారు. పెరిగిన విద్యుత్ బిల్లును విశాఖ ఉక్కు చెల్లించలేని స్థితి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రయోజనాల కన్నా బిజెపి ప్రయోజనాలకు వత్తాసు పలుకుతుంది. గతంలో విశాఖ ఉక్కుకు వచ్చే ఇసుక ర్యాంపులు ఇవ్వకుండా ఆపేశారు. నేడు విద్యుత్ కష్టాలు మొదలైతే విశాఖ ఉక్కు ప్రమాదంలో పడే పరిస్థితికి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఒరిస్సా నుండి రావల్సిన బొగ్గును రప్పిస్తే ఈ పరిస్థితి వుండేదికాదు. విశాఖ ఉక్కు పరిశ్రమ రక్షణకు ఏనాడు కూడా రాష్ట్ర పరిశ్రమల మంత్రిగా వున్న అమర్‌నాథ్ పట్టించుకోలేదు. ఈ కారణంగానే విశాఖ ఉక్కు ప్రమాదంలో పడింది. ఒరిస్సాలోని మహానది నుంచి వచ్చే ధర్మల్ బొగ్గు టన్ను కేవలం రూ.3200/- లకు దొరకుతుంది. ఇదే అదాని కంపెనీల నుండి టన్నుకు రూ.6500 నుండి రూ.12వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. విశాఖ ఉక్కు ఇప్పుడున్న పరిస్థితిలో ఇంత భారాన్ని మోసేస్థితిలో లేదు. విశాఖ ఉక్కును కష్టకాలంలో ఆదుకోవల్సింది పోయి కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మరింత క్షీణ స్థితిలోకి నెట్టేస్తే విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర ద్రోహం చేసినట్లే.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని బిఎఫ్-3ని జిందాల్ కంపెనీకి అప్పజెప్పారు. జిందాల్ కంపెనీ, విఎండిసి ఉమ్మడిగా జాయింట్ వెంచర్‌లో ప్రభుత్వం వాటా 11శాతంగా, జిందాల్ వాటా 89శాతంగా కట్టబెట్టి జిందాల్‌కు లాభాలు చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఐరన్‌ఓర్ టెండర్‌కు జిందాల్ జెఎస్‌డబ్ల్యు స్టీల్ లిమిటెడ్, జిందాల్ ఎస్ఎడబ్ల్యు లిమిటెడ్ సంస్థలే టెండర్లు వేయడం. మూడో కంపెనీకి అవకాశం లేకుండా చేస్తున్నారు. జిందాల్ ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కృషిచేసే దానికన్నా జిందాల్ ప్రయోజనాలే పరమావధిగా ఉంది. బిఎఫ్-3 జిందాల్ కంపెనీకి ఇచ్చిన తరువాత స్టీల్‌ప్లాంట్ సొంతగా నిర్వహిస్తున్న బిఎఫ్-1, 2ల ఉత్పత్తిలో తీవ్ర ప్రభావం పడిరది. యావత్తు స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని విద్యుత్ కష్టాల నుండి ఉక్కు పరిశ్రమను కాపాడాలని సిపిఎం పార్టీ విజ్ఞప్తి చేస్తుంది. లేనట్లు అయితే రేపు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన పాఠం నేర్పాల్సి వస్తుంది.

## దేవాన్ష్ పుట్టినరోజున శ్రీవారిని దర్శించుకున్న నారా లోకేశ్ కుటుంబ సభ్యులు



**తిరుమల:** తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుటుంబసభ్యులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుమారుడు నారా దేవాన్ష్ జన్మదినం సందర్భంగా లోకేశ్- బ్రాహ్మణి దంపతులు, నారా భువనేశ్వరి స్వామివారి దర్శనానికి వచ్చారు. రంగనాయకుల మండపంలో అర్చకులు వారికి వేదాశీర్వచనం చేశారు. దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు కుటుంబసభ్యులు అన్నదానం చేయనున్నారు. గురువారం ఉదయం శ్రీవారి భక్తులకు అల్పాహారం వడ్డించారు. ఒక్కరోజు అన్న వితరణకు అయ్యే ఖర్చు రూ.38 లక్షలను తితిదే అన్నప్రసాదం ట్రస్టుకు లోకేశ్ విరాళమిచ్చారు.

# ప్రాధాన్యతా రంగాలపై బ్యాంకులు దృష్టి పెట్టాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే బ్యాంకులు వ్యవసాయం, చిన్నపరిశ్రమలు, స్వల్పకాలిక వ్యవసాయ రుణాలపై మరింత దృష్టి సారించాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. బుధవారం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన డి.సి.సి., డి.ఎల్.ఆర్.సి మూడవ త్రైమాసిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం ప్రధాన రంగంగా వుందని, కాబట్టి వ్యవసాయం అనుబంధ రంగాలకు స్వల్పకాలిక రుణాలను ఎక్కువగా మంజూరు చేయాలన్నారు. తోటలు, కూరగాయలు, పశు సంవర్థక, డైరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూత నివ్వాలన్నారు. ఆయా శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో వ్యవసాయ, అనుబంధ రంగ రైతులను ప్రోత్సహించాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ రుణ ప్రణాళిక అమలు నివేదికను పవర్ పాయంట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.5088.12 కోట్లు ఎం.ఎస్.ఎం.ఈ.కి రూ.1566.9 కోట్లు కేటాయించడం జరిగిందని, ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సులు రూ.6802.32 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.6,800.62 కోట్లుతో కలిపి మొత్తం రూ.13,602.94 కోట్లని వివరించారు. అనంతరం ఆర్.బి.ఐ. ఎ.జి.యం. ఆర్.కె.హనుమకుమారి వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న రుణాలను సమీక్షించారు. బ్యాంకర్లు లక్ష్యాలను సాధించాలని, ఏమైనా సమస్యలుంటే జిల్లా అధికారులతో కలసి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి పి.నరేష్, నాబార్డ్ డిడియం సమంత్ కుమార్ మెప్మా పి.డి. ఎన్.సరోజిని కె.వి.ఐ.బి. ఏ.డి., వి.పద్మ, ఎపిటిడ్కో డిఈఈ బి.సంధ్య, పశు సంవర్థక శాఖ టెక్నికల్ అధికారి పి.భానుబాబు, మత్స్యశాఖ డిడి పి.ప్రసాద్,ఉద్యానవన శాఖ అధికారి జి.ప్రభాకారరావు, డిఐసి ఏడి జి.జోగినాధ్, డి.సి.సి.బి. సి.ఈ.ఓ. డివి యస్ వర్మ, ఇతర బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలలో అనుమతులకు సింగిల్ విండో

### జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి

### 50 వేలకు మించి నగదుతో ప్రయాణం చేయరాదు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పార్లమెంటు, అసెంబ్లీలకు నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులకు వివిధ అనుమతులు పొందేందుకు కలెక్టరు కార్యాలయంలో సింగిల్ విండో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి దయానిధి తెలిపారు. కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలు, అభ్యర్థుల ప్రచారాలకు సంబంధించిన అనుమతులు పార్లమెంటు, అసెంబ్లీల రిటర్నింగ్ అధికారులు జారీ చేస్తారని చెప్పారు. అనుమతులు ఆన్ లైన్ లో Suvidha (సువిధ) ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అయితే హెలికాప్టర్, హెలిప్యాడ్, ఎయిర్ బెలూన్ లకు జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టరు మాత్రమే అనుమతి ఇస్తారని తెలిపారు. సభలు సమావేశాలు, పార్టీ కార్యాలయం ప్రారంభం, ప్రచార వాహనాలు, ఊరేగింపులు, బారికేడ్ల నిర్మాణాలకు నియోజకవర్గ ఆర్.ఓ. నుండి అనుమతులు పొందాలన్నారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీలకు 48 గంటల ముందుగా అనుమతి పొందవలసి వుంటుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో ఎవరైనా రూ.50 వేల నగదుతో పట్టుబడినట్లయితే డబ్బును సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అయితే ఏ అవసరం నిమిత్తం సొమ్ము తీసుకువెళ్తున్నదీ ముందుగా కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమిటీ వద్ద నమోదు చేయించుకోవలసి వుంటుందన్నారు. స్క్వాడ్ తనిఖీ సమయంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ (ఫోన్ నం.8688365757)నకు ఫోన్ చేయించ వచ్చని వివరించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం పరిశీలకులు డి.రామమూర్తి, ఎస్.ఏ. తులసీరామ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు (టిడిపి), కె.హరనాథబాబు (ఆమ్‌ఆద్మీ) తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి నుంచి ఓటు.. అర్హులు ఎవరు?



**దిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం (ఈసీ) అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా 85ఏళ్లు పైబడినవారు, 40శాతానికిపైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. పోలింగ్ సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారు. నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తెస్తారు.

**ఏం చేయాలంటే..**

ఇంటి నుంచే ఓటేసే వెసులుబాటును ఉపయోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఫారం 12డి నింపి రిటర్నింగ్ అధికారికిగానీ, సహాయ రిటర్నింగ్ అధికారికిగానీ పంపించాలి. దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబరు పొందుపరచాలి. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది.

దరఖాస్తులను అందుకున్న తర్వాత సంబంధిత దరఖాస్తుదారుల ఇళ్లకు బూత్ స్థాయి అధికారులు వెళ్తారు. అర్హతలను బట్టి ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయం కల్పించాలా వద్దా అనేది నిర్ణయిస్తారు. అనంతరం పూర్తి చేసిన ఫారం 12డీని రిటర్నింగ్ అధికారికి అందజేస్తారు. అర్హత ఉంటే దరఖాస్తుదారుల ఇంటికి అధికారులే వెళ్లి ఓటు వేయిస్తారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేటప్పుడు ఎలాగైతే రహస్య ఓటింగ్ ఉంటుందో ఇంటి నుంచే ఓటు వేసేటప్పుడూ అలాగే అన్ని చర్యలు తీసుకుంటారు.

40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న ఓటర్లు దేశంలో 88.4 లక్షల మంది ఉన్నారని ఈసీ ఇటీవలే తెలిపింది. 85 ఏళ్ల వయసు పైబడిన వారు 82 లక్షల మంది ఉన్నారని పేర్కొంది.

వందేళ్లకుపైబడిన వారు 2.18 లక్షల మంది ఉన్నారని స్పష్టం చేసింది. వీరంతా కలిసి మొత్తం 1.73 కోట్ల మంది ఉన్నారని, వారందరికీ ఇంటి నుంచి ఓటు అవకాశం కల్పించనున్నట్లు సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు.

# ఉద్యోగుల సొమ్మూ వాడేశారు

విజయనగరం జిల్లా ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారి ఒకరు పక్షం రోజులు సరెండర్ లీవ్‌ను (సంపాదిత సెలవులు) నగదుగా మార్చుకోవాలని నిర్ణయించారు. ఏటా రూ.లక్షకు పైగా చొప్పున సుమారు రూ.4 లక్షలు రావాల్సి ఉంది. ఇతర అలవెన్స్‌లతో కలిపి రూ.6లక్షలకు పైగా అందాలి. బిల్లులు పెట్టినా మూడేళ్లుగా ప్రభుత్వం చెల్లించకుండా జాప్యం చేస్తోంది.

పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయుడికి మరో అయిదేళ్ల సర్వీసు ఉంది. ఈలోగా ఇళ్లు కట్టుకుందామని భావించారు. కొంత బ్యాంకు రుణం తీసుకున్నారు. ఇది చాలదని జీపీఎఫ్ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఏడాదైనా మంజూరు కాలేదు. దీంతో ఇంటి నిర్మాణం వాయిదా వేసుకున్నారు. కుమారుడి వివాహం ఎలా చేస్తానని ఆందోళన చెందుతున్నారు.

సగటు ఉద్యోగి నెలసరి వేతనంలో ఇంటి అద్దె.. నిత్యావసరాలు.. పిల్లల చదువులు.. విద్యుత్తు, సెల్‌ఫోన్ బిల్లుల చెల్లింపులతో.. లెక్కలేసుకుని బతుకుబండి నడుపుతాడు. ప్రతినెలా జీతంలో కొంత జీపీఎఫ్, ప్రభుత్వ బీమాలో పొదుపు చేస్తాడు. నగదు అత్యవసరమైతే నిబంధనల ప్రకారం ఇందులో రుణ రూపంలో తీసుకోవచ్చు. జగనన్న పాలనలో ఆ అవకాశం లేకుండా పోయింది. ఆ సొమ్ము పథకాల అమలుకు ప్రభుత్వం వాడేసుకుందని, అత్యవసర పరిస్థితుల్లో గట్టెక్కలేక పోతున్నామని రెండు జిల్లాల్లోని ప్రభుత్వోద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వమున్నా.. టీఏలు, డీఏలు, సరెండర్ లీవ్‌ను నగదు మార్చుకునే వెసులుబాటు ఉండేదని, ఈ ప్రభుత్వ హయాంలో సకాలంలో వేతనమే అందని పరిస్థితని వాపోతున్నారు. ఒక్కో ఉద్యోగికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వరకు రావాల్సి ఉందంటున్నారు.

ప్రభుత్వోద్యోగుల సంక్షేమానికి, వారి సామాజిక భద్రతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా పథకాన్ని (ఏపీజీఎల్ఐ) ప్రభుత్వం అమలు చేసోంది. ఉద్యోగ విరమణ నాటికి పాలసీ మెచ్యూర్ అయ్యేలా ప్లాన్ చేసుకున్నారు. ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసు 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు, ఆ తర్వాత 62 ఏళ్లకు పెంచింది. చాలామందికి పాలసీ గడువు తీరినా సకాలంలో అందని పరిస్థితి. కుటుంబ అవసరాలకు ఇందులో కొంత రుణ రూపంలో మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తూ కాలం చేసిన వారూ ఉన్నారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సుమారు 28 వేల మందికి పైగా ప్రభుత్వోద్యోగులు ఏపీజీఎల్ఐ పాలసీదారులుగా ఉన్నారు. వీరిలో పాలసీ గడువు ముగిసి బీమా నగదు మొత్తం అందుకునేందుకు 470 మంది క్లెయిమ్స్ కోసం ఎదురుచూస్తున్నారు. రూ.11.47 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో నుంచి రుణం మంజూరుకు 167 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రూ.1.69 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో పలువురు దరఖాస్తు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు.

అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రద్దు అమలు చేస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయకపోగా .. తిరిగి ఉద్యోగుల డబ్బే వాడేసుకుంటున్నారని ఉద్యోగవర్గాలు ఆరోపిస్తున్నాయి. వేతనాల నుంచి 10 శాతం మినహాయించి, దానికి ప్రభుత్వ వాటాగా మరో 10 శాతం కలిపి సీపీఎస్ ప్రాన్ ఖాతాకు జమ చేయాలి. తమ వాటా జమ చేయకపోగా వేతనాల్లో మినహాయించిన సొమ్ము ప్రభుత్వం అవసరాలకు వాడుకుంటోందని.. దీని వల్ల రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాటా మొత్తమే రెండు జిల్లాల్లో కలిపి సుమారు రూ.157 కోట్లు ఉంటుందన్నారు. గతేడాది మార్చి తర్వాత తమ ఖాతాల్లో సీపీఎస్‌లో ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ జమ కాలేదని మండిపడుతున్నారు. ఆర్థిక సంవత్సరం చివరిలోనైనా చెల్లిస్తుందా అని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వోద్యోగుల సరెండర్ లీవ్ సహా వివిధ రకాల బిల్లులేవీ మా వద్ద పెండింగ్‌లో లేవు. ఎప్పటికప్పుడు వాటిని చెల్లిస్తున్నాం. ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి సీఎఫ్ఎంఎస్ ద్వారా ఆ మొత్తాలను ఉద్యోగుల ఖాతాలకు నేరుగా జమ చేస్తారు. బడ్జెట్ మేరకు క్రమ పద్ధతిలో నిధులు విడుదలవుతాయి. ఎన్ని బిల్లులు పాస్ చేశారు.. ఇంకా ఎంత మందికి నిధులు జమ చేయాల్సి ఉంది.. అన్న వివరాలు మా వద్ద ఉండవు. మన రాష్ట్ర రాబడి.. ఖర్చు.. లెక్కలను బేరీజు వేసుకుని ఆర్థిక శాఖ చర్యలు తీసుకుంటుంది.

# బుల్లితెరపైకి మైత్రీ మూవీ మేకర్స్

### మా అన్నయ్య, మార్చి 25న ప్రారంభం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆసక్తికరమైన మలుపులు, ఆకట్టుకునే కథలతో సాగే సీరియల్ను అందిస్తున్న జీ తెలుగు మరో సరికొత్త సీరియల్ను తన అభిమాన వీక్షకులకు అందించేందుకు సిద్ధమైంది. అన్నాచెల్లెళ్ల అనుబంధం, కుటుంబ నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన కథ, కథనంతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ మా అన్నయ్య', ఈ సీరియల్లో అన్నాచెల్లెళ్ల మధ్యనున్న అనుబంధం, ప్రేమ, బాధ్యతలు, అనురాగాలను కొత్తకోణంలో చూపించనున్నారు. అనూహ్యమైన కథతో రానున్న మా అన్నయ్య' మార్చి 25న సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటలకు, మీ జీ తెలుగులో ప్రారంభం కానున్నది. మా అన్నయ్య సీరియల్ కథ గంగాధర్ జీవితం చుట్టూ తిరుగుతుంది. ప్రముఖ నటుడు గోకుల్ మీనన్ గంగాధర్ పాత్రలో కనిపించనున్నారు.

చిన్న వయసు నుంచే తన చెల్లెళ్ల బాగోగులు చూసుకునే బాధ్యతను తీసుకున్న ఒక అన్నయ్య కథే మా అన్నయ్య,

ఒక మధ్యతరగతి కుటుంబంలో తోబుట్టువుల మధ్య బంధాన్ని మా అన్నయ్య సీరియల్ కళ్లకు కట్టినట్లు చూపించనుంది. ఈ సీరియల్ కు సంబంధించిన ప్రోమోలు ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ అంచనాలను మరింతగా పెంచేశాయి. కుటుంబ నేపథ్యంలో సాగే కథతో రూపొందుతున్న ఈ సీరియల్ ప్రేక్షకుల అంచనాలను మించి వినోదం పంచేందుకు సిద్ధమవుతోంది.

ఈ షో గ్రాండ్ లాంచ్ మరియు దాని కథాంశం గురించి జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడూరు మాట్లాడుతూ, జీ తెలుగు ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో మర్కో విలక్షణమైన కథను తీసుకురావడం మాకు సంతోషంగా ఉంది. ఆకట్టుకునే కథాంశం, ప్రతిభావంతులైన నటీనటులతో రూపొందుతున్న ఈ కథ మన హృదయానికి చాలా దగ్గరగా ఉంటుంది. అంతేకాకుండా, తెలుగు బుల్లితెరపై తొలిసారిగా ఒక కథానాయకుడి కోణం నుంచి చూడబోతున్న మా అన్నయ్య ప్రేక్షకులను తప్పక అలరిస్తుందనే నమ్ముతుమన్నారు..

ప్రధాన పాత్ర పోషిస్తున్న గోకుల్ మీనన్ మాట్లాడుతూ.. 'జి తెలుగులో నేను నటిస్తున్న రెండో సీరియల్ ఇది.ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న ఈ సీరియల్లో నటించడం చాలా ఆనందంగా ఉంది. భావోద్వేగాలతో కూడిన ఇలాంటి లోతైన పాత్రను పోషించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు.

ఈ సీరియల్ ప్రారంభం సందర్భంగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు మాట్లాడుతూ. వెండితెరపైనే కాకుండా బుల్లితెర ప్రేక్షకులకూ వినోదం పంచడంలో భాగమవుతున్నందుకు సంతోషంగా ఉంది. ఆకట్టుకునే సీరియల్స్, కార్యక్రమాలతో విజయవంతంగా కొనసాగుతున్న జీ తెలుగు మా పరిధిని విస్తరించేందుకు ఒక అద్భుతమైన వేదికను అందిస్తోంది. భావోద్వేగభరితమైన కథతో రూపొందుతున్న 'మా అన్నయ్య' సీరియల్ ద్వారా ప్రేక్షకులను అలరించేందుకు ఉత్సాహంగా ఉన్నాం. వెండితెర మాదిరిగానే బుల్లితెరపైనా ప్రేక్షకులు మమ్మల్ని ఆదరించి, ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం' అన్నారు.

# పిచ్చుకలను పరిరక్షించుకుందాం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి గ్రీన్ క్లబ్ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా మన ఇంటి పిచ్చుకలను మనమే కాపాడుకుంటాం అనే కరపత్రాలను పట్టణంలో ప్రసిద్ధి చెందిన హెూమియో వైద్యులు బి శశిధర్ ఆవిష్కరించారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శశి ధర్ మాట్లాడుతూ పిచ్చుకలు మనుషులకు దగ్గరగా ఉంటాయని, జీవావరణంలో పిచ్చుకలు కీలకమని అన్నారు. పిచ్చుకలు అంతరించిపోతే ప్రకృతి కి విపత్తు కలుగుతుందని భావించాలనీ అన్నారు. పక్షుల సంరక్షణకు పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ క్లబ్ చేస్తున్న సేవలు అమోఘమని ఆయన కొనియాడా రు. శ్రీధర్ మాస్టర్ మాట్లాడుతూ పిచ్చుకలను ఇంటి నేస్తాలుగా అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ పిచ్చుకల సంరక్షణ కోసం ఇంటి వద్ద పిచ్చుక గూళ్ళు పిడికెడ గింజలు కాసిన్ని నీళ్లు ఏర్పాటుచేసి వేసవిలో వాటి దాహార్తి తీర్చాలన్నారు. కార్యక్రమంలో ఫిజియో థెరపీ వైద్యులు కే గణేష్, దంత వైద్యులు కొణతాల అర్చనలను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), కర్రి హనుమంతరావు, బీరా వినోద్ కుమార్, పి. సురేష్ బేత శేష సాయి, బొడ్డేడ మురళి, నయ శెట్టి సత్యారావు, వై సంతోష్, మల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 19న తెల్లవారుజామున 5 గంటలకు సబ్బవరం పి.ఎస్ క్రైమ్ నెంబర్:82/24 గంజాయి కేసులో పోలీస్ సిబ్బంది పి.సి:2008, పి.పరదేశి నాయుడు, హెచ్.జీ:557 జె.నాగేశ్వరరావు లు విధులు నిర్వహిస్తుండగా అనుమానాస్పదం గా వెళ్తూ, పోలీసులను చూసి తప్పించుకునే క్రమంలో ఎంతో చాకచక్యంతో ఆటోను నిలువరించి, తనిఖీ చేయగా (16 ప్యాకెట్లు) 32.980 కేజీల గంజాయి లభ్యమయింది. చింతపల్లి నుండి సబ్బవరం మీదుగా తుని కి గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, గంజాయిని, ఒక ఆటో, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఎస్పీ గారు ప్రశంసించి, నగదు రివార్డులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మురళి కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసులు స్టాటిక్ చెక్ పోస్ట్ లు, డైనమిక్ చెక్ పోస్ట్ లు, గస్తీ పోలీస్ సిబ్బంది ముమ్మర తనిఖీలు నిర్వహించి అక్రమ గంజాయి, నాటు సారా, మద్యం రవాణా అరికట్టాలని, నగదు ఇతర ఉచిత కానుకలు పంపిణీ నిరోధించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# సుప్రీంకు పతంజలి క్షమాపణ



**ఢిల్లీ:** తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టుకు క్షమాపణలు తెలియ జేసింది. ధిక్కార పిటిషన్‌పై సమాధానం ఇవ్వకపోవడంతో రెండు రోజుల క్రితం అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన రామ్‌దేవ్ బాబా, మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణకు సమన్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా స్పందన వచ్చింది.

ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గతేడాది నవంబర్‌లో ఆ సంస్థను మందలించింది. తమ ఉత్పత్తులు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తాయంటూ 'అసత్య', 'తప్పుదోవ' పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని సూచించింది. లేదంటే కోర్టు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో సంస్థ తరఫున న్యాయవాది కోర్టుకు వెల్లడించారు.

# జైలు నిండా గంజాయి నిందితులే

అనకాపల్లి జిల్లాలో రోజురోజుకు నేరస్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం కారాగారాల్లో ఉన్న గదులు సరిపోవడం లేదు. విశాఖపట్నంలోని కేంద్ర కారాగారం (సీజే) సైతం ఖైదీల సెల్‌లు పరిమితికి మించి ఎప్పుడో నిండిపోయాయి. వీరిని కిక్కిరిసి ఉంచడం మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందని ఆందోళన చెందుతున్నారు. దీంతో అనకాపల్లి జిల్లాలో అనువైన ప్రాంతంలో జిల్లాస్థాయి కారాగారాన్ని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

కొత్తగా ఏర్పాటైన అనకాపల్లిలో జిల్లాస్థాయి కార్యాలయాలు చాలావరకు ఉన్నాయి. వీటి తరహాలోనే కారాగారాన్ని సమకూర్చాల్సిన అవసరం ఉందని గతంలోనే భావించారు. స్థలాల లభ్యత అడ్డంకి కావడంతో దీని గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం మానవ హక్కులకు భంగం కలిగించేలా బందిఖానాల పరిస్థితి తయారైందనే మాట వినిపిస్తోంది.. గదులు కొరవడి నిందితులు ఉన్నవాటిలో ఇరుగ్గా మగ్గిపోతున్న పరిస్థితి కొనసాగుతోంది. ఈ విషయాన్ని జైళ్ల శాఖ డెరెక్టర్ జనరల్ (డీజీ) దేశంలోని సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించారంటున్నారు. దీనిపై సుప్రీంకోర్టు సైతం అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు జైళ్ల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు జిల్లా జైలు కోసం స్థలాల వెదుకులాట ప్రారంభమైంది.

జిల్లాల్లోని కారాగారాల్లో గదులు సరిపోకపోవడానికి పెచ్చుమీరుతున్న గంజాయి కేసులే కారణంగా గుర్తించారు. కొంతకాలంగా కేసులు పెరగడంతో విశాఖలోని సీజే తోపాటు అనకాపల్లి జిల్లాలోనూ నిందితుల సంఖ్య గణనీయంగా పెరిగిందంటున్నారు. విశాఖపట్నం కేంద్ర కారాగారంలో పలు నేరాల్లో శిక్షపడిన ఖైదీలతోపాటు గంజాయి రవాణా కేసుల్లో రిమాండ్ నిందితులు సైతం ఉంటున్నారు. ఇక్కడ గదులన్నీ గతంలోనే నిండిపోయి అదనపు ముద్దాయిలతో కిటకిట లాడుతున్నాయని చెబుతున్నారు. అనకాపల్లి నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలిలోని ఉపకారాగారాల్లోనూ పరిమితికి మించి రిమాండ్ ఖైదీలను సర్దుబాటు చేసి నెట్టుకొస్తున్నారు. అనకాపల్లిలో 35 మందికి సరిపడా గదులుండగా వీటిల్లో ఇప్పుడు 82 మంది వరకు బందీలుగా ఉంటున్నారు. వీరిలో ఏకంగా 50 మంది గంజాయి నేరస్థులేనని సమాచారం.

**స్థలాలకు మూడు చోట్ల పరిశీలన**

జిల్లాస్థాయి కారాగారం కోసం నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం ప్రాంతాల్లో అనుకూలమైన స్థలం కోసం అధికారులు పరిశీలిస్తున్నారు. అనకాపల్లిలో స్థలం లభ్యమైతే అన్నివిధాలా బాగుంటుందని భావిస్తున్నారు. అక్కడ కాకుంటే డివిజన్ కేంద్రమైన నర్సీపట్నంలో అనుకూలమేనని అంటున్నారు ఇక్కడా సాధ్యం కాకుంటే చోడవరం సైతం అందరికి అందుబాటులో ఉండే ప్రాంతంగా అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అనకాపల్లిలో రెవెన్యూ అధికారులకు స్థలం కోసం లేఖ అందజేశారు.

**పది ఎకరాలు అడిగాం**

అనకాపల్లి జిల్లాల్లో ప్రతిపాదించిన మూడు ప్రాంతాల్లో ఎక్కడో ఒక చోట వెంటనే స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీని నిమిత్తం జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అనకాపల్లి కలెక్టర్‌కు ఇప్పటికే ఒక లేఖను పంపారు. దీనిని నర్సీపట్నం ఆర్‌డీఓ జయరాంకు సైతం అందజేశాం. సుమారు పది ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అన్ని అనుమతులతో జైలు శాఖకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నాం.

# ప్రపంచ బెస్ట్ సెల్లర్ న్యూ పిజ్జా హట్ మెల్ట్స్

- ఇప్పుడు భారతదేశంలోనికి..




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారతదేశంలో అత్యంత ఇష్టపడే విశ్వసనీయ పిజ్జా బ్రాండ్, పిజ్జా హట్ తమ ప్రపంచ బెస్ట్ సెల్లర్ మెల్ట్స్‌ను ప్రారంభించింది. ఇది భారతీయ క్యూఎస్ఆర్ మార్కెట్లోకి కొత్త విభాగాన్ని తీసుకొస్తుంది. మెల్ట్స్ అనేది ఒక భిన్నమైన, సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన భోజన ఎంపిక. ఇది వినియోగదారుల బిజీ జీవనశైలికి అనుగుణంగా ఉంటూ, ఎప్పుడైనా ఎక్కడైనా తినడానికి అనువైనదిగా ఉంటుంది

క్రిస్పీ, చీజీ ఇంకా లోడెడ్, ఆల్-న్యూ మెల్ట్స్, సన్నని మరియు క్రిస్పీ క్రస్ట్‌లో ఫ్లేవర్‌ఫుల్ ఫిల్లింగ్‌లతో నిండి, కరిగిన 100% మోజారెల్లా చీజ్, ఫ్లేవర్‌ఫుల్ సాస్ వేసి మడతపెట్టి బట్టరీ గ్లేజ్ పూసి మరియు ప్రత్యేకమైన మసాలా చల్లి పరిపూర్ణంగా బేక్ చేయబడుతుంది. మెల్ట్స్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది,ఇప్పుడు భారతీయ రుచి ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆరు ఆనందకరమైన మెల్ట్స్ వేరియంట్‌లు అందిస్తోంది: వెజ్ బార్బెక్యూ, చికెన్ బార్బెక్యూ, చీజీ చీజ్, చీజీ చీజ్ చికెన్, మ్యాజికల్ మఖ్నీ పనీర్ మరియు చికెన్ టిక్కా, ఇంకా కీమా సుప్రీంతో తయారు చేయబడుతుంది.

ఈ సందర్భంగా పిజ్జా హట్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ మేనేజింగ్ డైరెక్టర్ మెర్రిల్ పెరేరా మాట్లాడుతూ మెల్ట్స్ అనేది భారతదేశంలో మనం ఎప్పుడూ తినని ఉత్పత్తి అన్నారు. బ్రాండ్-న్యూ కేటగిరీలోకి మా రాకను తెలియజేస్తుందన్నారు. ఎప్పుడూ బిజీగా ఉండే మా కస్టమర్‌లకు తప్పనిసరిగా సంతృప్తి కలిగించే విధంగా, ఎప్పుడైనా ఎక్కడైనా ఎలాంటి అంతరాయం లేకుండా, తినడానికి చాలా సౌకర్యవంతంగా ఉండే మెల్ట్స్ ప్రారంభించినందుకు సంతోషిస్తున్నామన్నారు. రకరకాల రుచులు, గొప్ప విలువ కలిగిన మెల్ట్స్ ధర పిజ్జా హట్ ప్రియులందరినీ కచ్చితంగా ఆనందపరుస్తుందన్నారు. . ఇంట్లో టీవీ చుస్తున్నా, పనిలో రోజంతా బిజీగా ఉన్నా, లేదా ఆహారం ఆస్వాదించాలనుకున్నా, క్రిస్పీగా, చీజీగా ఇంకా ఫుల్లీ లోడెడ్ మెల్ట్స్ అనేది కచ్చితంగా సరిపోయే ఎంపిక కావడం ఖాయమన్నారు. మెల్ట్స్ కేవలం రూ. 169 కే డైన్-ఇన్, డెలివరీ ఇంకా టేక్‌అవే వంటి సదుపాయాలతో భారతదేశంలోని అన్ని పిజ్జా హట్ రెస్టారెంట్‌లలో (850o) అందుబాటులో ఉందన్నారు. అదనంగా, పిజ్జా హట్, ఒకరి కోసం మెల్ట్స్ మీల్ & ఇద్దరి కోసం త్రీ-కోర్స్ మీల్ వంటి అద్భుతమైన కాంబోలు డీల్‌లను కూడా అందిస్తుందని తెలిపారు. మెల్ట్స్‌తో పాటు, పిజ్జా హట్ చాలా కాలంగా ఎదురుచూస్తున్న థిన్ ఎన్' క్రిస్పీ క్రస్ట్‌ను కూడా పరిచయం చేసిందన్నారు. వివిధ రకాల ప్రత్యేకమైన టాపింగ్ కాంబినేషన్‌లతో, కస్టమర్‌లు ఆస్వాదించడానికి మరిన్ని పిజ్జా క్రస్ట్ ఎంపికలను అందిస్తోందని తెలిపారు.

# ధరిత్రి గంటను జయప్రదం చేయండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ధరిత్రి గంటను జయప్రదం చేయండి ఈ నెల 23వ తేదీ రాత్రి 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు విద్యుత్ ఉపకరణాలు ఆపండి అని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ప్రోగ్రాం ఆఫీసర్ హానీ సెలజ్ కోరారు. ఈమేరకు ఆమె గురువారం ఉదయం ఆంధ్రా యూనివర్సిటీ సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ లో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ అటవీ దినోత్సవం, ధరిత్రి గంట నిర్వహణ గురించిన ప్రచార కార్యక్రమ ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. భూగోళాన్ని పరిరక్షించేందుకు డబల్యు డబల్యు ఎఫ్ ప్రపంచ వ్యాప్తంగా చాలా నగరాలలో ఒక గంట విద్యుత్తు ప్రధాన ప్రదేశాలలో స్వచ్ఛందంగా ఆపివేయించడం, ఎవరి ఇళ్ళలో వాళ్ళు విద్యుత్ ఉపకరణాలు ఆపివేయడం ద్వారా కర్బన ఉద్గారాలు తగ్గించడం, తద్వారా విద్యుత్తు ను ఆదా చేయాలి అనే ఆలోచన ప్రతి ఒక్కరి లో కలిగించే విధంగా ఉపయోగపడుతుంది అన్నారు. విద్యుత్తు ను ఆదా చేస్తే సమస్త జీవరాసులనీ కాపాడేందుకు, మన తరాన్నీ, భవిష్యత్తు తరాలను కాపాడేందుకు ఉపకరిస్తుంది అన్నారు. మన దేశంలో ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం లలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమానికి అంబాసిడర్లుగా దలార్ సాల్మన్, దియా మీర్జా, పి వి సింధూ, అన్నయ్యా పాండే ఈషా రెబ్బా, తరుణ్ భాస్కర్, గీతా భాస్కర్ లు ఉన్నారన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ ధరిత్రి గంటను జయప్రదం చేయాలని కోరారు. ఈ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు 2008 నుండి 2019 వరకు విశాఖపట్నం లో నిర్వహించడం జరిగింది అన్నారు. ఈ మద్య గడిచిన నాలుగు సంవత్సరాలుగా పెద్దగా నిర్వహించలేదనీ, ఈ ఏడాది ఘనంగా నిర్వహించాలని కోరారు. ముఖ్యమైన ల్యాండ్‌మార్క్‌లు, స్మారక చిహ్నాలు, ప్రభుత్వ భవనాలు, చారిత్రక ప్రదేశాలు, విద్యాసంస్థలు, కార్పొరేట్ కార్యాలయాలు ధరిత్రి గంటకు మద్దతు ఇవ్వాలని కోరారు.

సిఫా ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ అడవుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అందుకే తాము విస్తారంగా మొక్కలు నాటిస్తున్నామని, విత్తనాల బంతులు తయారు చేయడం, కొండలమీద వేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ హర్నాద్, ఇతర టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు మాట్లాడారు.

అటవీ దినోత్సవం, ధరిత్రి గంట నిర్వహణ గురించి నగరం లో పలు విద్యా సంస్థల్లో ప్రచార కార్యక్రమాలు డబల్యు డబల్యు ఎఫ్, సిఫా ట్రస్ట్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ లు నిర్వహించాయి.

## కొణతాలకు మద్దతు ప్రకటించిన నందగోపాల్ కుటుంబం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మాజీ మంత్రి తెలుగుదేశం బిజెపి జనసేన అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణకు కసింకోట మండలానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంథం నంద గోపాల్ కుటుంబ సభ్యులు మద్దతు తెలియజేశారు.. గురువారం రింగ్ రోడ్ లోని పార్టీ కార్యాలయానికి నందగోపాల్ సతీమణి ,కుమార్తె తో పాటు పలువురు విచ్చేసి రామకృష్ణకు బొకే అందజేసి మద్దతు తెలియజేశారు.. రానున్న ఎన్నికల్లో కొణతాల విజయానికి పనిచేస్తామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు.. వీరికి కొణతాల అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు.. నందగోపాల్ గతంలో అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు చేతిలో స్వల్ప తేడాతో ఓటమి చెందారు.. కసింకోట మండలంలో నందగోపాల్ కుటుంబానికి మంచి పట్టు ఉంది .వారు కొణతాల కు మద్దతు తెలియజేయడంతో జనసేన టిడిపి బిజెపి వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## హిందీ సాహిత్య భారతి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఎస్ఎంఇక్బాల్ కి ఘన సన్మానం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈనెల 13, 14 తేదీల్లోకజికిస్తాన్లో అంతర్జాతీయ హిందీ సమ్మేళ నానికి భారత ప్రభుత్వ ప్రతినిధిగా పాల్గొన్న ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ అధ్యక్షులు ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.ఎం. ఇక్బాల్ 'హిందీ భాషా వికాసంలోని చారిత్రాత్మక సంఘటనలు' అనే అంశంపై ప్రసంగ పత్రాన్ని సమర్పించి అందరి మన్ననలు పొంది సత్కారం అందుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని హిందీ సాహిత్య భారతి ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ పీకే జయలక్ష్మి ప్రసంగంలో తెలిపారు. రాజభాష హిందీ వ్యాప్తికి ఆచార్య ఎస్.ఎం. ఇక్బాల్ చేస్తున్న కృషికి ఖజకిస్తాన్ విశ్వ హిందీ సభల్లో ప్రత్యేకంగా ఆయనని సన్మానించారని డాక్టర్ కె. రాజశేఖర్ తెలిపారు. ద్వారకా నగర్ ప్రిజం కళాశాలలో సహృదయ సాహితి, హిందీ సాహిత్య భారతి సంయుక్తంగా నిర్వహించిన సాహితీ కార్యక్రమానికి లో ఆచార్య ఎస్.ఎం. ఇక్బాల్ ప్రత్యేక అతిథిగా విచ్చేసి మనదేశంలోనే కాక విదేశాల్లో సైతం హిందీని ఆదరిస్తున్నారని, తన మాతృదేశంలో తాను చేస్తున్న హిందీ సేవలను విదేశీయులు గుర్తించి సన్మానించడం గర్వకారణమని తెలిపారు.తమ గురువుగారికి దక్కిన అరుదైన గౌరవం ఎంతో స్ఫూర్తిదాయకమని వారి శిష్యులు తెలిపారు. అనంతరం ఆచార్య ఎస్ఎం ఇక్బాల్ ని సాహిత్య సంస్థల వారు శాలువాలతో జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ గోపాల్ ,శేఖరమంత్రి ప్రభాకర్,డాక్టర్ కేజీవేణు, డాక్టర్ అనిత, రాధారాణి ప్రసంగించారు.

# కూటమికి లోక్ సత్తా మద్దతు శుభపరిణామం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జనసేన, టిడిపి బిజెపి ఉమ్మడి కూటమికి లోక్‌సత్తా పార్టీ మద్దతు తెలియ జేయడం శుభ పరిణామమని మాజీమంత్రి అనకాపల్లి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు.గురువారం రింగ్ రోడ్ లోని పార్టీ కార్యాలయంలో జరిగిన లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి నీ రామకృష్ణ సత్కరించారు. అనంతరం హాజరైన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. జయప్రకాష్ నారాయణ వంటి మేధావి ఉమ్మడి ఓటమిని స్వాగతించటం హర్షనీయం అన్నారు .నిస్వార్ధ నాయకుడని జై ప్రకాష్ నారాయణను కొనియాడారు.. మూడు పార్టీల పొత్తు ప్రజలకు అవసరమని అన్నారు.. రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు ఆయననాంది పలికారన్నారు.. పదవుల కోసం పాకులాడలేదన్నారు. 19 ఏళ్లుగా ఆయన నాయకత్వంలో పనిచేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జి ఉత్తరాంధ్ర చర్చ వేదిక ద్వారా ఎన్నో పోరాటాలకు తనకు మద్దతుగా నిలిచారన్నారు .అనకాపల్లి మొదటి శాసనసభ్యులు బీశెట్టి అప్పారావు మనవడు అయిన బీశెట్టి బాబ్జి మాట్లాడుతూ విజ్ఞత కలిగిన నేత కొణతాల అని కొనియాడారు.. జేపీ తర్వాత జయప్రకాష్ నారాయణ ను తాను ఇష్టపడిన నాయకుడు రామకృష్ణ అని అన్నారు .ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొణతాల సేవలు అవసరమన్నారు. ఆయన అనకాపల్లి నుండి గెలుపొందడం చారిత్రాత్మక అవసరం అన్నారు .అనకాపల్లికి జయప్రకాశ్ నారాయణ ను తీసుకురావడం జరుగుతుందన్నారు... ఇక్కడ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో . భరత్ రాజు టిడిపి నాయకుడు కర్రి బాబీ, జనసేన నాయకుడు దూలంగోపి, గంజిసత్య రావు ,మంగా ఈశ్వర్ పాల్గొన్నారు.

## ఎన్టిపిసి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు




**పరవాడ, (విశాఖ సమాచారమ్):** ఎన్ టి పి సి-సింహాద్రి యొక్క జి ఈ ఎం-2024 వర్క్‌షాప్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్టిపిసి యొక్క ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌లో భాగంగా, బాలికా సాధికారత మిషన్-2024 వర్క్‌షాప్ యొక్క మొదటి కార్యాచరణ మార్చి 19న దీపాంజలినగర్‌లోని జీవన్ రేఖ హాస్పిటల్‌లో ప్రారంభమైంది.

పరవాడ మండలానికి చెందిన 5వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య పరీక్షలతో వర్క్‌షాప్ ప్రారంభమైంది.

100 మందికి పైగా బాలికలు ఇప్పటికే వైద్య పరీక్షలు చేయించుకున్నారు, విద్యార్థుల లక్ష్యం చేరే వరకు ప్రక్రియ కొనసాగుతోంది.

ఎన్టిపిసి ఆసుపత్రికి చెందిన వైద్యులు మరియు సిబ్బందిచే ఉచితంగా అందించబడిన చెకప్‌లు, సమాజ సంక్షేమం మరియు బాలికల సాధికారత పట్ల సంస్థ యొక్క నిబద్ధతను చాటాయి. విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా అవసరమైన ఆరోగ్య సంరక్షణ సహాయాన్ని అందజేసేలా తనిఖీ సమయంలో ఉచిత మందులను పంపిణీ చేశారు.

# ఇక చెప్పడం ఉండదు...చర్యలే



**విజయనగరం:** క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కోడ్ ఉల్లంఘనపై దృష్టిపెట్టి కేసులు నమోదు చేయాలని సూచించారు. నిర్లిప్తతను విడనాడాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడ్ అమల్లోకి వచ్చి ఇప్పటికే 72 గంటలు గడువు దాటిపోయిందని, నిబంధనలను అమలు చేయనివారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

తాశిల్దార్లు, ఎంపిడిఓలు, పోలీసు అధికారులు, ఎంసిసి బృందాలు, ఇతర ఎన్నికల సిబ్బందితో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎంసిసి నిబంధనలను వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే నమోదైన కొన్ని సంఘటనలపై క్షేత్రస్థాయి అధికారులనుంచి తమకు ఇంతవరకు సమాచారం రాకపోవడం పట్ల నిలదీశారు. ఇకనుంచీ ఇలాంటి సంఘటనలను సహించేది లేదన్నారు. ఎన్నికల నియమావళిని అమలు చేయడానికి సాధారణ అధికారులతోపాటు, పోలీసు సిబ్బందిని కూడా నియమించడం జరిగిందని, వీరంతా పరస్పరం సమన్వయంతో, మరింత క్రియాశీలంగా వ్యవహరించాలని సూచించారు. ఎట్టిపరిస్థితిలోనూ ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకూడదని, జరిగితే తప్పనిసరిగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కోడ్ ఉల్లంఘన సంఘటనలకు స్థానిక అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎంసిసి, ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల బృందాలు సంబంధిత ఆర్‌ఓ క్రిందనే పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఎన్నికలకు సంబంధించి సువిధ వెబ్సైట్, యాప్ ల ద్వారా మాత్రమే అనుమతులు జారీ చేయబడతాయని కలెక్టర్ తెలిపారు. సింగిల్ విండో విధానంలో ఆర్‌ఓల ద్వారా అనుమతులు జారీ చేస్తారని, అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సుమారు 19 రకాల అనుమతులను జారీ చేస్తారని వివరించారు. ఎన్నికల సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రచారం, వాహనాలు తదితర అన్నిటికీ అనుమతులు అవసరమని తెలిపారు. ధరఖాస్తు చేసిన వెంటనే వీలైనంత త్వరగా అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. తాత్కాలిక పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయాలంటే అనుమతి తప్పనిసరి అని, ఆ ఇంటి యజమాని నుంచి అంగీకార పత్రం ఉండాలని చెప్పారు. ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ఇళ్లలో బ్యానర్లు, స్టిక్కర్లు పెట్టాలంటే, ఆ ఇంటి యజమాని నుంచి అనుమతి ఉండాలని, ప్రచారం కోసం ప్రత్యేకంగా తయారుచేయించిన వాహనాలకు ఆర్టిఓ నుంచి ఫిట్‌నెస్ పత్రం ఉండాలని తెలిపారు. అలాగే లైట్లు ఉండే గ్లోసైన్ బోర్డులకు కూడా స్థానిక సంస్థల నుంచి అనుమతి ఉండాలని చెప్పారు. ప్రస్తుతం జరిగే ప్రచార ఖర్చులు పార్టీ ఖాతాలోకి వెళ్తాయని, నామినేషన్ వేసిన తరువాత చేసే ఖర్చు అభ్యర్థి ఖాతాలో లెక్కిస్తారని తెలిపారు. ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులు కొనసాగుతాయని, కొత్తగా పనులు మంజూరు కానీ, ప్రారంభం కానీ జరగకూడదని తెలిపారు. ప్రభుత్వం నుంచి జీతం, వేతనం,లేదా గౌరవ భృతి తీసుకొనే ప్రతీఒక్కరికీ నియమావళి వర్తిస్తుందని, వారు రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో, ప్రచారాల్లో పాల్గొనకూడదని కలెక్టర్ తెలిపారు. నిబంధనలను అతిక్రమించే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలుంటాయని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఇతర ఉద్యోగులను పూర్తిగా విధులనుంచి తొలగించడం జరుగుతందని చెప్పారు.

జిల్లా ఎస్‌పి దీపిక మాట్లాడుతూ, ఎంసిసికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారణ చేయాలన్నారు. ఏమాత్రం ఉల్లంఘన జరిగినా కేసు నమోదు చేయాలని ఆదేశించారు. కేసుల నమోదుకు సంబంధించి వివిధ సెక్షన్లను వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేయడంలో సాధారణ అధికారులతోపాటు, పోలీసు అధికారులకు కూడా బాధ్యత ఉందని స్పష్టం చేశారు. అనుమతులు లేని కార్యక్రమాలను, ఎంసిసి ఉల్లంఘనలను ఫొటోలు, వీడియోలు తీసి, కేసు నమోదు చేయాలని ఎస్‌పి సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వెంకట త్రివినాగ్, డిఆర్‌ఓ ఎస్‌డి అనిత, నోడల్ ఆఫీసర్లు, పోలీసు అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** దేవుని గుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆలయ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారి కల్యాణంలో పాల్గొని చూసి తరించారు. స్వామివారి కల్యాణ తలంబ్రాలను భక్తులు శిరస్సు న ధరించారు. గురువారం ఉదయం

స్థాలీపాక హోమాలు వివాహ ప్రవేశ ప్రధాన హోమాలు మరియు విశేష హోమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయంఈవో టి రాజ సులోచన, ఆలయ అర్చకులు పులఖండం విజయ్ బాబు, పులఖండం గిరిబాబు, ప్రసాదబాబు ,రాజేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా లో తప్పుడు ప్రచారాలను, ట్రోలింగ్ లను తీవ్రంగా పరిగణిస్తాం: జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆన్ లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్లు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించిన జిల్లా ఎస్పీ కెవి మురళీకృష్ణ అన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాట్సప్, టెలిగ్రాం మరియు ఫేస్ బుక్ గ్రూపుల్లో అడ్మిన్ యొక్క బాధ్యతలు

వాట్సప్, టెలిగ్రాం మరియు ఫేస్ బుక్ వంటి గ్రూప్ లో ప్రతి పోస్టుకి బాధ్యత తీసుకోవాలి. గ్రూప్ లో యాడ్ చేసే ప్రతి సభ్యుడు తప్పకుండా అడ్మిన్ కి తెలిసి ఉండాలి.

అభ్యంతకర, తప్పుడు వార్త, వదంతులు పై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలి. ఎవరైనా సభ్యులు అభ్యంతకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్నుంచి తొలగించాలి.ఆ వివాదస్పద పోస్టింగ్ సంబంధించి అడ్మిన్ ఏం చర్యలు తీసుకోకుంటే అతడిపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.వివాదస్పద పోస్టు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయి.

**షేర్ చేయకూడని విషయాలు ..**

విద్వేషాలు రెచ్చగొట్టేవి,తప్పుడు సమాచారం,తెలియని సమాచారంవర్గపోరు కు దారి తీసేవి.మార్ఫింగ్ చేసిన ఫోటోలు తప్పుదారి పట్టించే సమాచారం ఎన్నికల నియమావళి కూడా అమలులో ఉన్నందువలన ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్లు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడడం ద్వారా చట్ట వ్యతిరేకమైన పనులలో భాగస్వామం అయిన యెడల చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోనుబడతాయి.

**సోషల్ మీడియాలో నిత్యం వైరల్ అయ్యే ఫేక్ న్యూస్‌ను గుర్తించే మార్గాలు, విధానాలు :**

**సమాచారాన్ని ధృవీకరించండి:** ఏదైనా వార్త లేదా సమాచారాన్ని పంచుకునే ముందు, విశ్వసనీయ మూలాల నుండి దాని ప్రామాణికతను ధృవీకరించండి.

**ఫాక్ట్ చెక్ ( క్రాస్-చెక్)** : దాని ఖచ్చితత్వాన్ని నిర్ధారించడానికి బహుళ మూలాల నుండి ఒకే వార్తలను తనిఖీ చేయండి.

%https://factcheck.pib.gov.in/- To check and report the fake news

@PIB_India- On Twitterhttps://www.facebook.com/pibindia/?ref=embed_page- Facebook, https://www.kooapp.com/profile/PIBFactCheck

**ఇతరులకు అవగాహన కల్పించండి:** సమాచారాన్ని పంచుకునే ముందు దాన్ని ధృవీకరించడం యొక్క ప్రాముఖ్యత గురించి స్నేహితులు మరియు కుటుంబ సభ్యులకు తెలియజేయండి.

**నకిలీ వార్తలను నివేదించండి:** నకిలీ వార్తలను మీరు కనుగొన్న ప్లాట్‌ఫారమ్ లేదా సోషల్ మీడియా సైట్‌కు నివేదించండి.

**వాస్తవ తనిఖీ సైట్‌లను ఉపయోగించండి:** వార్తలను భాగస్వామ్యం చేయడానికి ముందు వాటి ప్రామాణికతను ధృవీకరించడానికి వాస్తవ తనిఖీ వెబ్‌సైట్‌లను ఉపయోగించండి.

**క్లిక్‌బైట్ హెడ్‌లైన్‌లను నివారించండి:** సంచలనాత్మకంగా అనిపించే లేదా నిజం కావడానికి చాలా మంచి హెడ్‌లైన్‌లను క్లిక్ చేయడం లేదా షేర్ చేయడం మానుకోండి.

ఫార్వార్డ్ చేసిన సందేశాలతో జాగ్రత్తగా ఉండండి: మీకు ఫార్వార్డ్ చేయబడిన సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండండి, ప్రత్యేకించి అవి అనుమానాస్పదంగా అనిపిస్తే.

క్రిటికల్ థింకింగ్ ఉపయోగించండి: వార్తా మూలాలు మరియు కథనాల విశ్వసనీయతను అంచనా వేయడానికి విమర్శనాత్మక ఆలోచనను ఉపయోగించండి. బాధ్యతాయుతమైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించండి: సమాచారాన్ని పంచుకునే ముందు దాన్ని ధృవీకరించమని ఇతరులను ప్రోత్సహించండి. ఏదైనా సమాచారాన్ని పోలీసు వారికి తెలియజేయడానికి పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడింది.

పోలీస్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9440904229.లి (సమాచార అందించిన వారి వివరాలు గోప్యముగా ఉంచడం



జరుగుతుంది.)

అనకాపల్లి జిల్లా పోలీసు వారిని సోషల్ మీడియా సామాజిక మాధ్యమాలలో సంప్రదించడానికి Twitter :- https://twitter.com/AKPPolice/

Facebook:https://www.facebook.com/anakapallidistrictpolice/

Instagram: https://www.instagram.com/anakapallidistrictpolice/

WhatsApp Channel:-

https://whatsapp.com/channel/0029VaPd1DQFsn0mOsuj2V1b% అనుసరిచండి.

రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అనకాపల్లి జిల్లా పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ.మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు.



ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా వైఎస్ఆర్సిపి పశ్చిమ నియోజకవర్గం పరిశీలకులుగా డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు మరియు రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, ఉత్తరాంధ్ర రీజనల్ కో - ఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు వై.వి సుబ్బా రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):**

## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్ల తొలగింపు

**విజయనగరం:** ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తూ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్లను తొలగించినట్టు జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గంలో, ఎస్.కోట మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అలుగుబిల్లి గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామ వలంటీర్లు బత్తుల కృష్ణ, బోనెల మనోజ్ కుమార్‌లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని తెలిపారు. ఈ ఇద్దరు వలంటీర్లు స్థానిక శాసనసభ్యునితో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై అక్కడి రిటర్నింగ్ అధికారి విచారణ జరిపి, వారిపై వచ్చిన ఆరోపణలు నిర్ధారిస్తూ నివేదిక అందజేసిన మీదట యీ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

# మోదీయే జగన్ రక్షకుడు

వేల కోట్ల రూపాయల అవినీతి కేసుల్లో పదేళ్లుగా బెయిల్‌పై ఉన్న వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకు వెళ్లకుండా కాపాడుతున్నది ప్రధాని నరేంద్రమోదీ అన్నసంగతి ఏపీలో చిన్న పిల్లోడినడిగినా చెబుతారు. అలాంటి మోదీకి కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు ఉందా? వైసీపీ, కాంగ్రెస్ ఒకటేనని ప్రధాని నరేంద్ర మోదీ చిలకలూరిపేట సభలో మాట్లాడటాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌పై ఐటీ, ఈడీ, సీబీఐలను ప్రయోగించిన మోదీ గారికి ఆంధ్రాలో జరుగుతున్న అవినీతి కనిపించలేదా? సాక్షాత్తు హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఏపీకి వచ్చి రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై తీవ్ర విమర్శలు చేశారు. మరి ఇందుకు బాధ్యులైన జగన్ సహా ఇతర మంత్రులపై కేసులు పెట్టాలని మోదీకి అనిపించలేదంటేనే మోదీ-జగన్ మధ్య లాలూచీఉందని అర్థమవుతుంది. మూడు రాజధానులని జగన్ అంటుంటే... మోదీ మాత్రం రాష్ట్రంలోని ముగ్గురు నాయకుల(బాబు, పవన్, జగన్)తో మూడుముక్కలాట ఆడుతున్నారు. ఆంధ్రుల మనోభావాలతో చెలగాటమాడు తున్నారు. గత ఐదేళ్లుగా కేంద్రంలోని మోదీసర్కారు తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలన్నింటినీ వైసీపీ సమర్థించిన మాట వాస్తవంకాదా? జగన్ విచ్చలవిడిగా అప్పులు తెచ్చేందుకు మోదీ ప్రభుత్వం అనుమతు లిచ్చింది వాస్తవం కాదా? జగన్ బాబాయ్ వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తు సాగనీయకుండా అడ్డుకున్నది మోదీ కాదా? అంతెందుకు జగన్ కోరికమేరకు చంద్రబాబుకు బెయిల్‌రాకుండా అడ్డుకున్నది మోదీ కాదా? మోదీ-జగన్ అవగాహనతోనే కదా విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ జరుగుతున్నది. గంగవరం పోర్టు అదానీకి కట్టబెట్టింది కూడా మోదీ సూచనమేరకే కదా?...పెద్ద నియంత-చిన్న నియంత చక్కటి అవగాహనతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తుంటే... మధ్యలో కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలుస్తుందంటూ మోదీ మాట్లాడుతున్నారంటే మోదీ-జగన్ కుట్రలో భాగంగానే టీడీపీ-జనసేన ఎన్డీఏలోకి ట్రాప్ చేశారని అనుమానం రాక మానదు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బాగుకోసం కట్టుబడి ఉంది. 2019లోనే రాహుల్ గాంధీ మొదటి సంతకం ప్రత్యేక హోదా ఫైల్ మీదనేనని స్పష్టం చేశారు. ఇప్పటికీ దానికే కట్టుబడి ఉన్నారు. మా అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మరోవైపు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాష్ట్రానికి బీజేపీ చేసిన అన్యాయాన్ని, వైసీపీ, టీడీపీలు ఆ పార్టీలకు తొత్తులుగా మారిన వ్యవహారాన్ని సైతం ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఉందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

పదేళ్ల క్రితం తిరుమల శ్రీనివాసుని సాక్షిగా మరలా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిగా ప్రధాని నరేంద్ర మోదీ పేట సభలో పచ్చి అవాస్తవాలు మాట్లాడారు. విభజన తర్వాత చితికిపోయిన రాష్ట్రానికి అత్యంత కీలకమైన ప్రత్యేక హోదా, జాతీయ హోదా కలిగిన పోలవరంప్రాజెక్టు, అమరావతి రాజధాని సహా విభజన చట్టంలోని ఇతర హామీలను నెరవేర్చడం గురించి ఒక్కమాట కూడా చెప్పకుండా డబుల్ ఇంజన్ సర్కారుతో ఏపీ అభివృద్ధి చెందుతుందని మాట్లాడటం అత్యంత దుర్మార్గం. మరోసారి ఐదుకోట్లమంది ఆంధ్రులకు మోదీ దగా చేశారు. తెలుగులో మాట్లాడటం, ఎన్టీఆర్‌ను పొగిడితే ఆంధ్రుల కష్టాలు తీరిపోతాయా? అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ అంశాన్ని, ఎన్టీఆర్ రాముడు, కృష్ణుడు పాత్రలు అద్భుతంగా పోషించారని పొగడటం ద్వారా హిందువుల ఓట్లు దండుకునే ప్రయత్నం చేశారు. విద్యాసంస్థలు మంజూరు చేశామని చెప్పుకుంటున్న మోదీకి వాటి ప్రహరీలు కూడా పూర్తికాలేదనే విషయం తెలియదా? అయుష్మాన్ భారత్ పేరుతో 1.20 కోట్ల మందికి ఆరోగ్యం అందించామని చెప్పడం పచ్చి బూటకం. ప్రజల ఆరోగ్య డేటాతో ఫార్మా కంపెనీలను ఉద్ధరించడానికే అయుష్మాన్ భారత్‌ను తెచ్చారు తప్ప పేదలకు మేలు చేయడానికి కాదు. రాష్ట్ర ప్రజలు ప్రత్యేకహోదా కావాలని అడుగుతుంటే రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్ చేస్తామనడం సిగ్గుచేటు.దేశ వ్యాప్తంగా ఇండియా కూటమికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేకనే మోదీ పదేపదే కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారు. భారత్‌జోడో న్యాయయాత్రను విజయవంతంగా పూర్తిచేసిన రాహుల్ గాంధీని చూసి మోదీ వెన్నులో వణుకుపుడుతోంది. ఇక ఏపీకి తీరని అన్యాయంచేసిన బీజేపీకి ఆంధ్రులు ఏనాడో రాజకీయంగా సమాధి కట్టారన్న సంగతి టీడీపీ, జనసేనకు తెలియకపోవడం దౌర్భాగ్యం. రాష్ట్రంలో నోటాకు వచ్చే ఓట్లు కూడా లేని బీజేపీతో ఆపార్టీలు జట్టుకట్టడం చారిత్రక తప్పిదం. రాష్ట్రానికి అన్యాయం చేసిన నియంతను చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొగడటం తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని గంగలో కలపడమే. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి ఎటువంటి ప్రకటన చేయించలేనప్పుడు వందల కోట్లు ఖర్చుచేసి సభ ఎందుకు పెట్టారో వారికే తెలియాలి.ఇక రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం నడుస్తోందని మంత్రులు అవినీతికి పాల్పడటంలో ఒకరికొకరు పోటీపడుతున్నారన్న మోదీ వ్యాఖ్యలపై పదేపదే ఢిల్లీకి వెళ్లి మోదీకి మెమొరాండాలు సమర్పించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు సమాధానం చెప్పాలి. అంతిమంగా ఆంధ్రులకు అన్యాయం చేసిన మోదీని, బీజేపీని ఆపార్టీతో జతకట్టిన టీడీపీ, జనసేన పార్టీలకు అలాగే అదే బీజేపీతో రహస్య అవగాహనతో రాష్ట్రంలో విధ్వంసకర, నియంతృత్వ పాలన సాగిస్తున్న వైసీపీని రాష్ట్ర ప్రజలు తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాల్సిన ప్రాంతీయ పార్టీల అధినేతలు చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్‌లు మోదీకి తొత్తులుగా వ్యవహరించడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. వీరు ఓట్లడగటానికి వచ్చినప్పుడు ప్రజలు నిలదీయాలి. ఇప్పటికైనా ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర లౌకికపక్షాలతో కూడిన ఇండియా కూటమిని ఆదరించాలి.

ఇట్లు:
**కొలనుకొండ శివాజీ**
**ఏపీసీసీ ఉపాధ్యక్షుడు**

# అవంతి శ్రీనివాస్‌కు బ్రహ్మరథం పట్టిన అనంతవరం, పెంట గ్రామ ప్రజలు



**పద్మనాభం, (విశాఖ సమాచారమ్):** పద్మనాభ మండలంలో ఎన్నికల శంకరం పూరించిన అనంతరం తొలి ఎన్నికల ప్రచార సభ పద్మనాభం మండలం పరిషత్ అధ్యక్షులు కే రాంబాబు ఆధ్వర్యంలో అనంతవరం పెంట గ్రామాల్లో ఘనంగా నిర్వహించడం జరిగినది అనంతవరం గ్రామము పెంట గ్రామంలో నాలుగో రోజు అవంతి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు ప్రచార కార్యక్రమానికి విచ్చేసిన అవంతి శ్రీనివాస్ కు ముందుగా పంచాయతీ ప్రజలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు డీజే మరియు తీన్మార్ మో తలతో బాన సంచా వెలుగులతో సాంప్రదాయ సాంస్కృతిక కోలాటాల ను త్యాలతో జై జగన్ జై అవంతి రావాలి జగన్ కావాలి అవంతి అంటూ నినాదాలతో ఓరెత్తిస్తూ మహిళలు మహిళలు మంగళ హారతులతో సాదర స్వాగతం పలుకుతూ జై అవంతి జై అవంతి అనే నినాదాలతో ప్రాంగణము అంతయు మార్మోగి పోయినది అవంతి పంచాయతీ దారి పొడుగునా ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి నన్ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనకు వైసీపీ ప్రభుత్వంలో జగనన్న అందించిన పాలనకు మధ్య వ్యత్యాసం ప్రజలైన మీకే బాగా తెలిసిందని గత ప్రభుత్వాల పాలన మాదిరిగా వైసీపీ పాలనలో లంచాలు లేవు ప్రభుత్వ అధికారులు కార్యాలయాలు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే పరిస్థితి లేదు నాయకులు పథకాలు అమలు కానీయకుండా అడ్డుకునే పరిస్థితి లేదు అర్హత ఉంటే చాలు కులం మతం ప్రాంతం పార్టీ చూడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్కడ కూర్చొని బటన్ నొక్కితే నేరుగా మీ ఖాతాల్లోకి డబ్బులు జమవుతున్నాయి తొలి కోడి కూయక ముందే మీ గడప దగ్గరకు వాలంటీర్లు వచ్చి తలుపుతట్టి చిరునవ్వుతో టెన్షనుగా పెన్షన్ తో పాటు మీ పథకాలు అందించడం జరుగుతుంది రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్న వస్తేనే మీకు అందించిన సంక్షేమ పథకాలు అమలు పాలనతో పాటు మరింత సు పరిపాలన అందించడం జరుగుతుందని లేదంటే గతంలో మాదిరిగా కాలు అరిగేలా తిరిగే పరిస్థితి లంచాలు ఇవ్వడం చాలా ప్రతీది నరకం చూడడమే కనుక మీకు అన్నం పెట్టే వారు కావాలో సున్నం పెట్టే వారు కావాలో మీకు మీరు ఆలోచించుకొని భీమిలిలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నన్ను మూడవసారి ముచ్చట గెలిపించాలని అభ్యర్థిస్తూ మాట్లాడారు ఈ కార్యక్రమంలో పద్మనాభ ఎంపీపీ కే రాంబాబు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్ గిరిబాబు పద్మనాభ మండల పార్టీ అధ్యక్షుల కే లక్ష్మణ అనంతరం గ్రామ సర్పంచ్ గొర్రెపోటు లక్ష్మీ పెద్ద ఎర్రి నాయుడు అనంతవరం సీనియర్ వైసీపీ నాయకులు రొంగలి రవి ,గేదెల సత్యనారాయణ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అన్నమయ్య కృష్ణాపురం మాజీ సర్పంచ్ బోలె అప్పలనాయుడు టీ తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను అనంతరం వైసిపి నాయకులు కే సత్యనారాయణ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# "కౌమారదశలో ఉన్న బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ ఉక్కు కర్మాగారం లో కొనసాగుతున్న స్వచ్ఛతా పఖ్వాడా 2024లో భాగంగా, ఆర్ఐఎన్ఎల్ 7వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఉన్న కౌమార బాలికలకు మంచి పరిశుభ్రమైన జీవనశైలిని అందించడానికి, బహిష్టు పరిశుభ్రతపై అక్కిరెడ్డిపాలెం లోని జెపీహెచ్ స్కూల్‌లో 'పరివర్తన్'- అన్న ఆరోగ్య సంబంధిత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది.

విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్ చీఫ్ స్పెషలిస్ట్, (ప్రసూతి మరియు గైనకాలజీ) డాక్టర్ జి సుజాత రుతుక్రమ పరిశుభ్రత మరియు మంచి పరిశుభ్రత పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ పరివర్తన కార్యక్రమానికి ఉపాధ్యాయులతో పాటు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాంఘిక నిషేధాలు మరియు పారిశుద్ధ్యం మరియు పరిశుభ్రత సౌకర్యాలపై తగిన సమాచారం పై కూడా కార్యక్రమంలో విపులంగా చర్చించారు.

# హెటరో ఒప్పందంనకు కట్టుబడి ఉన్నాము.. శివదత్



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** గత సంవత్సరం నవంబర్ 5న జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివదత్ బోడపాటి గారి సమక్షంలో హెటెరో కంపెనీకి మరియు ధర్నా చేసిన మత్స్యకారులకి మధ్య జరిగిన ఒప్పందం.

రాజయ్యపేట పంచాయతీ పెద్దలు, ధర్నా చేసిన మత్స్యకారులు కలిసి ప్రతిపాదించిన 15 ఒప్పందాలను హెటెరో కంపెనీ యజమాన్యం నేరవేర్చుటకు ఒప్పుకొని కంపెనీ లెటర్ హెడ్ పైన పొందుపర్చి పోలీసు శాఖ వద్ద పెట్టడం జరిగింది.

ఇప్పటికే 15 ప్రతిపాదాలలో కొన్నిటికి శ్రీకారం చుట్టింది హెటెరో కంపెనీ, అందులో భాగంగా మొన్న జరిగిన మహా శివరాత్రికి 10 లక్షలు, గుడి నిర్మాణం, డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, గ్రామ రోడ్లు ఇలా క్రమ వ్యవధిలో అన్ని డిమాండ్లను పూర్తి చేయడానికి హెటెరో కంపెనీ సిద్ధంగా ఉంది, హెటెరో కంపెనీ అన్ని డిమాండ్లను పూర్తి చేసే వరకు మత్స్యకారులకు అండగా ఉంటాం అని బోడపాటి శివదత్ తెలియపరిచారు.అలాగే నవంబర్ 5న ధర్నా చేసిన మత్స్యకారుల కోసం ప్రత్యేకం గా ప్యాకేజీ కోసం కంపెనీ ని అడగటం జరిగింది, దానికి కంపెనీ సానుకులంగా స్పందించి చేయడానికి సిద్ధపడింది, ఐతే ఇతర పార్టీల ప్రోద్భలం వలన నవంబర్ 6 వ తేదీనుంచే హెటెరో కంపెనీ పైనా వ్యతిరేఖంగా ధర్నా చేసిన మత్స్యకారులు కేసులు పెట్టడం జరిగింది. ప్యాకేజీ విషయంలో కంపెనీ ప్రతిపాదించిన పరిష్కారం ఒక్కటే , రాజయ్యపేట పంచాయితీ పెద్దలు మరియు ధర్నా చేసిన మత్స్యకారులు కలిసి కంపెనీతో మాట్లాడాలని తెలియపరిచారు.

ఇందులో మోసం ఎక్కడ లేదు, జనసేన పార్టీ బోడపాటి శివదత్ ప్రజాధారణ చూసి అక్కసుతో కొంత మంది కుట్ర చర్య ఇది ఈ కార్యక్రమంలో ఆకేటి గోవిందరావు, కురందాసుఅప్పలరాజు, పాము గణేష్, యలమంచిలి చంద్రావు, జోగారావు, గబ్బర్‌సింగ్, యేసు బాబు, బాబురావు, బద్రి, రంగబాబు, జగదీష్, కనక రాజు,జగన్,జగన్నాధరావు, మహేశ్, మంగరాజు, రాజు బంగారి, ఆనంద్, నాగరాజు, రాజు, తులసి మరియు నాలుగు మండలాల జనసైని కులు తదితరులు వున్నారు.

# గిరిజనులు వేటకు ఉపయోగించే 25 నాటు తుపాకులు స్వాధీనం



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** గిరిజనులు వేటకు ఉపయోగించే 25 నాటు తుపాకులను స్వాధీనం చేసు కోవడం జరిగిందని చింతపల్లి సబ్ డివి జన్ అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. సబ్ డివిజనల్ కార్యాలయం లో పాత్రికేయులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. స్థానిక ఎస్సై అరుణ్ కిరణ్ ఆధ్వర్యంలో మండలం లోని పది తుపాకులు స్వాధీనం చేసు కోవడం జరిగిందని, చింతపల్లి సబ్ డివిజనల్ పరిధిలో మరో 15 తుపాకు లను స్వాధీనం చేసుకోవడం జరిగిం దన్నారు. నాటు తుపాకులు గిరిజనుల వద్ద కలిగి ఉండడం చట్టరీత్యా నేరమన్నారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలీస్ శాఖ సిబ్బంది గ్రామాలలో సందర్శించి, అనుమానిత సోదాలు నిర్వహించి నప్పుడు నాటు తుపాకులు కలిగి ఉంటే ఆ కుటుంబంపై చట్ట ప్రకారం శిక్షించడంతో పాటు పదేళ్ల జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎస్ఐ అరుణ్ కిరణ్ ప్రత్యేక చొరవతో మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్లి నాటు తుపాకులు కలిగి ఉన్న గిరిజనులతో చర్చించి, నాటు తుపాకుల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి తుపాకులను స్వాధీనం చేసుకోవడం శుభ పరిమాణం అన్నారు. నాటు తుపాకులు స్వాధీనం చేసుకోవడంలో ఎస్ఐ అరుణ్ కిరణ్ చొరవ చూపి కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో ఆయనను అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిను పీతల గోవింద్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గురువారం విశాఖ తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ 22వ వార్డు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 230 పిఎస్ బిఎల్ఎ పద్మారాణి పిఎస్‌లో ఉన్నటువంటి మహిళలు పీతల గోవింద్ కండువా వేసి ఆహ్వానించారు, గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అభివృద్ధి చూసి, వచ్చానని తెలియజేశారు కార్యక్రమంలో వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కళ్యాణ భారతి
సేవాసమితి - రి.నెం. 902/2014
చిరునామా. 5-12-138/1, మంగాపురం, హెచ్.బి. కాలనీ, మౌలాలి, హైదరాబాద్ - 500 040.
దశమ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక
(బ్రాహ్మణులలో అన్ని వయస్సుల వారికి, అన్ని శాఖల వారికి, అన్ని వృత్తుల వారికి)
తేది. 31-03-2024, ఆదివారం, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 3.00 గం॥ల వరకు
వేదిక: వి.ఎన్.ఆర్. గార్డన్స్-2, మల్లాపూర్, నాచారం, హైదరాబాద్.

ఇస్కఫ్ ISCUF
INTERNATIONAL WATER DAY MOTHER EARTH DAY
అంతర్జాతీయ జల దినోత్సవము భూమాత దినోత్సవము
at 9 AM on Friday 22th MARCH, 2024 at GVMC GANDHI JI STATUE, VSP
- ప్రపంచ ఫుడ్ బాస్కెట్ గా పిలువబడే సముద్ర జలాలను కలుషితం కాకుండా కాపాడుకుందాం
- నదీ జలాలు నిర్వీర్యంగా సముద్రంలో కలిసిపోకుండా & కలుషితం అవ్వకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకోవాలి.
భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం
INDIAN SOCIETY FOR CULTURAL CO-OPERATION AND FRIENDSHIP, VISAKHAPATNAM




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676